




గొల్లప్రోలు పట్టణ శివారు కొత్తకాలనీకి వెళ్లే ప్రాంతంలో నిర్మించిన ప్రత్యామ్నాయ రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న సుద్దగడ్డ వరద నీరు

ఫ్లాష్ ఫ్లడ్.. ముప్పు



గొల్లప్రోలులో సుద్దగడ్డ వరద ముంపులో వరి పంటపొలాలు



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కురుస్తున్న వాన

- బంగాళాఖాతంలో మరింత బలపడిన అల్పపీడనం
- దీనిప్రభావంతో రాబోయే రెండు రోజులు వర్షాల ముప్పు
- కాకినాడ పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక జారీ
- అల్పపీడనంతో గురువారం జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం గురువారం మరింత బలపడింది. దీంతో రానున్న రెండురోజుల్లో పలుచోట్ల భారీవర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల, యానాంలో ఆకస్మిక వరద(ఫ్లాష్‌ఫ్లడ్) వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ప్రస్తుతం పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం గురువారం మరింత బలపడింది. దీంతో భారీ వర్ష సూచన ఉండడం, అటు సముద్రం అల్లకల్లోలంగా మారడంతో కాకినాడ పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక ఎగురవేశారు.

ప్రస్తుతం కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గురువారం పలుచోట్ల భారీవర్షాలు కురిశాయి. ముఖ్యంగా బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం 6గంటల వరకు అనేకచోట్ల భారీగా వర్షం పడింది. అత్యధికంగా శంఖవరం మండలంలో ఏకంగా 12.3సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రౌతులపూడి 9.5, తొండంగి 9, తాళ్లరేవు 7.2, కరప 7.1, గొల్లప్రోలు 7సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. అటు గురు వారం ఉదయం నుంచి రాత్రివరకు వర్షం కొంత శాంతించింది. యు.కొత్తపల్లి 1.4మిల్లీమీటర్లు, గొల్లప్రోలు 5.25మి.మి, పెద్దాపురం 5.20 మి.మి, మరో 10మండలాల్లో స్వల్పస్థాయిలో వర్షం కురిసింది. కాగా బుధ, గురువారాల్లో కురిసిన వర్షాలతో కాకినాడ-సామర్లకోటరోడ్డులో పలుచోట్ల నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. రహదారిపై వరదనీటి ప్రవాహంలోనే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు అలాగే ఉండిపోయింది. అల్పపీడనం కారణంగా పొంచి ఉన్న వర్షాలతో జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్‌రూంలు కొనసాగుతున్నాయి. కాకినాడ పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక ఎగురవేయగా కేవలం రెండు నౌకల్లోనే బియ్యం ఎగుమతులు స్వల్పస్థాయిలో జరుగుతున్నాయి.

సుద్దగడ్డకు పోటెత్తిన వరద

- గొల్లప్రోలు కాలనీకి నిలిచిపోయిన రాకపోకలు.. రోడ్లపై వరద నీరు

గొల్లప్రోలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సుద్దగడ్డకు వరద పోటెత్తింది. ఎక్కడిక్కడ పంట పొలాలు, రహదారులు ఏకమయ్యాయి. రోడ్లపై వరద నీరు ప్రవహించగా, పొలాలు ముంపులో చిక్కుకున్నాయి. వర్షాలతో సుద్దగడ్డకు గురువారం భారీగా వరద నీరు చేరింది. గొల్లప్రోలు వద్ద గట్లకు సమాంతరంగా కాలువల్లో నీరు ప్రవహిస్తోంది. పట్టణశివారు కొత్తకాలనీకి నిర్మిస్తున్న బ్రిడ్జికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసిన రహదారిపై నాలుగున్నర అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తోంది. రహదారి కోతకు గురైంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచాయి. కాలనీవాసులు ప్రత్యామ్నాయ మార్గాల్లో కాలనీకి చేరేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.ఎవరూ అటువైపు వెళ్లకుండా హెచ్చరికలు తెలిపే ఏర్పాట్లు చేయడంతోపాటు పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. అయినా విద్యార్థులు, కొందరు స్థానికులు ప్రమాదకరంగా వారధికి నిచ్చెన వేసి ఎక్కి సాహసం చేశారు. కాలనీకి రాకపోకలు సాగించేందుకు బోటు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. గొల్లప్రోలు పట్టణ శివారుశివాలయమాన్యం, సూరంపేట వెళ్లే మార్గాల్లోకి వరద నీరు చేరింది. గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారి, చేబ్రోలు-మల్లవరం రోడ్డు పై పలుచోట్ల వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తాటిపర్తి రోడ్డులో రాకపోకలను నిలిపివేశారు.

సుద్దగడ్డకు వరద నీరు ఉధృతంగా రావడంతో గొల్లప్రోలు, చేబ్రోలు, సీతానగరం, లక్ష్మీపురం గ్రామాల్లో 1800 ఎకరాల్లో వరి పంట, 200ఎకరాల్లో పత్తిపంట, కాయగూరల పంటలు నీట మునిగాయి. వరి నాట్లు వేసి రెండు, మూడు వారాలు గడవకుండానే ముంపునకు గురవడంతో రైతులు ఆవేదనచెందుతున్నారు.

మాకు బోటు వేయండి సారూ!



గొల్లప్రోలు కొత్తకాలనీ నుంచి పాఠశాల, కళాశాలలకు ప్రమాదకరంగా నిచ్చెన వేసుకుని బ్రిడ్జిని దాటుతున్న విద్యార్థులు

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు కాకినాడ పోలీసు పరేడ్ మైదానంలో సంబరాలు
- ముఖ్యఅతిథిగా పాల్గొంటున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



కాకినాడలోని పోలీసు పరేడ్ మైదానంలో చేసిన ఏర్పాట్లు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోలీసు పరేడ్ మైదానంలో 79వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 8.55గంటలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పోలీసు పెరేడ్ మైదానానికి చేరుకుంటారు. ఉదయం 9గంటలకు ఆయన జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 9.05 గంటలకు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.15గంటలకు డిప్యూటీ సీఎం ప్రసంగం ప్రారంభమవుతుంది. 9.30గంటలకు పోలీసు కవాతు, 10 గంటలకు ప్రగతి శకటాల ప్రదర్శన నిర్వహిస్తారు. 10.30గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 11గంటలకు ప్రభుత్వ ఉద్యోగుల కు ఉత్తమ ఉద్యోగుల పురస్కారాలను ఆయన అందజేస్తారు.12గంటలకు సభస్థలంనుంచి బయలుదేరి వెళ్తారు. డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ రెండోసారి స్వాతంత్ర్యవేడుకల్లో జాతీయ జెండా ఆవిష్కరణ చేయనున్నారు. వర్షాల నేపథ్యంలో పోలీసు పరేడ్ మైదానంలో రైన్‌ప్రూఫ్ టెంట్లు ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథి ఉన్న సభావేదికతోపాటు అధికారులు, మీడియా, వీక్షించేందుకు వచ్చిన సభికుల కోసం ప్రత్యేకంగా ఈటెంట్లు ఏర్పాటుచేశారు. మైదానంలో ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ, మత్స్యశాఖ, పశుసంవర్థకశాఖ, సోషల్ వెల్ఫేర్, అటవీశాఖ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, పోలీసు, ఎక్సైజ్‌శాఖలతో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో ఉదయం 7.40 గంటలకు..

కాకినాడ కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 7.40 గంటలకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. దీనిలో కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొంటున్నారు.



రాత్రి కాకినాడ విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, ఎంపీ ఉదయ్

డిప్యూటీ సీఎం ప్రోగ్రాం షెడ్యూల్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం ఉదయం 8.40గంటలకు కాకినాడలో ఉన్న జీఆర్‌టీ హోటల్ నుంచి పోలీసు పరేడ్ మైదానానికి బయలుదేరుతారు. ఉదయం 8.50గంటలకు పోలీసు పరేడ్ మైదానానికి చేరుకుంటారు. స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు అక్కడి నుంచి రాజమండ్రి ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు. మధ్యాహ్నం 1.25 గంటలకు రాజమండ్రి ఎయిర్‌పోర్టు కు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు రాజమండ్రి ఎయిర్‌పోర్టు నుంచి గన్నవరం బయలుదేరుతారు. మధ్యాహ్నం 2గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.05 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 2.45గంటలకు మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. ఈ నిమిత్తం పవన్‌కల్యాణ్ తన భార్యతో కలిసి గురువారం రాత్రి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడినుంచి బయలుదేరి కాకినాడ విచ్చేశారు.

జిల్లాలో 205మందికి ఉత్తమ ఉద్యోగి పురస్కారాలు

నేడు అందజేయనున్న ఉపముఖ్యమంత్రి

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లాలోని 205మంది ఉద్యోగులకు ఉత్తమ ఉద్యోగుల(బెస్ట్ పెర్ఫార్మెన్స్) పురస్కారాలు అందజేయనున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నుంచి వారంతా ఈ పురస్కారాలు అందుకుంటారు. దీనిలో జిల్లాస్థాయి అధికారులు 20, రెవెన్యూ విభాగంనుంచి 30మంది, పోలీసుశాఖ నుంచి 20మంది, ఎన్‌జీవోలు ఐదుగురు, సివిల్ సప్లయిస్ శాఖ ఐదుగురు ఉద్యోగులు ఎంపికయ్యారు. వ్యవసాయశాఖ, ఏపీఎస్‌ఆర్‌టీసీ, ఏపీఎంఎస్ఐడీసీ, సీపీవో, డీపీవో, విద్యాశాఖ, ఐసీడీఎస్, వైద్యఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులు పురస్కారాలు అందుకోనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులు విడుదల చేశారు.

మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఏర్పాట్లు పూర్తి



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసరావు

- జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసరావు

కాకినాడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించే స్త్రీ శక్తి పథకం అమలుకు అన్నిఏర్పాట్లు పూర్తిచేశామని ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకాన్ని శుక్రవారం సాయంత్రం స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారన్నారు. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డు, ఏపీలో నివాసం ఉంటున్నట్టుగా ప్రభుత్వం జారీ చేసిన ఏ గుర్తింపు కార్డునైనా తీసుకువెళ్లి మహిళలు ఈ బస్సుల్లో ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ ప్రయాణం నాన్‌స్టాప్, అంతరాష్ట్ర సర్వీసులు, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులకు వర్తించబోదన్నారు. ఉచిత బస్సు ప్రయాణానికి అనుగుణంగా అన్ని ఈ పోస్ మెషీన్లు సిద్ధం చేశామని తెలిపారు. ఫ్రీ పాస్‌కు సంబంధించి ప్రత్యేక కీ ఏర్పాటు చేశామని, అది నొక్కితే జీరో టికెట్ అని వస్తుందని వివరించారు. కాకినాడ జిల్లాలో మొత్తం 157 బస్సులు ఉండగా అందులో 39 అల్ట్రా పల్లె వెలుగు, 136 పల్లె వెలుగు, రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయన్నారు.

పిఠాపురంలో రూ.9.60కోట్లతో ఇండస్ట్రియల్ పార్కు

- నేడు శంకుస్థాపన చేయనున్న పవన్‌కల్యాణ్

పిఠాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం బైపాస్ రోడ్డులో అగ్రహారంవద్ద రూ.9.60కోట్లతో మినీ ఇండస్ట్రియల్ పార్కు(ఫ్లాటెట్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు) ఏర్పాటుచేయనున్నారు. దీనికి కాకినాడనుంచి వర్చువల్ విధానంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం శంకుస్థాపన చేస్తారు. రెండెకరాల విస్తీర్ణంలో బహుళ అంతస్తుల భవనం నిర్మించి మేన్యుఫ్యాక్చరింగ్, అసెంబ్లింగ్, స్టోరేజీ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ప్రతి కుటుంబంనుంచి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్త ఉండాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ పార్కు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో గరిష్ఠంగా రూ.25కోట్ల వ్యయంతో యూనిట్లు ఏర్పాటుకు అనుమతిస్తారు. 26,900 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలుచేపట్టి కనీసం 20యూనిట్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పార్కు ఏర్పాటు చేస్తున్నారు.



స్త్రీ..రంగదే!

స్వాతంత్ర్య దినోత్సవ వేళ మూడు మార్పులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- బాలికలు,మహిళలు,ట్రాన్స్‌జెండర్లకు ఆధార్‌తో ఫ్రీ
- హైవే ప్రయాణానికి ఫాస్టాగ్ వార్షిక పాస్
- రూ.3 వేలు చెల్లిస్తే 200 సార్లు ఛాన్స్
- రాజ్‌మార్గ్‌యాత్ర యాప్ ద్వారా పాస్‌లు
- రైతులకు కొత్త పాస్‌బుక్‌లు నేటి నుంచే

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో నేటి నుంచి మూడు రకాల కీలక నిర్ణయాలు అమల్లోకి రానున్నాయి. వీటి ద్వారా ఇకపై పలు వర్గాలకు స్వేచ్ఛ లభించనుంది. ముఖ్యంగా మహిళలు,యువతులు, హైవేలపై ప్రయాణించే వాహనదారులు, అన్నదాతలు లబ్ధిపొందనున్నారు. నేటి నుంచి అమల్లోకి రానున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,హైవే టోల్‌గేట్ల దోపిడీ నుంచి బయటపడేలా కొత్త ఫాస్టాగ్ వార్షిక పాస్, కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీయే. ఈ మూడు కీలక నిర్ణయాల అమలుతో ఆయా వర్గాల్లో ఆనందం వెల్లువిరుస్తోంది.

నేటి నుంచి ఫ్రీ..

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేటి సాయంత్రం నుంచి అందుబాటులోకి రానుంది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా బాలికలు, మహిళలు,ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం అందుబాటులోకి రానుంది. కేవలం ఆధార్‌కార్డు చూపించి రాష్ట్రమంతటా ఉచితంగా ప్రయాణించొచ్చు. ఈ మేరకు ఈపథకాన్ని సీఎం చంద్రబాబు నేటి సాయంత్రం ప్రారంభించనున్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అడ్డగోలుగా ఆర్టీసీ ఛార్జీలను పెంచేసి పేదల నడ్డి విరగ్గొట్టింది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు టీడీపీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించి నేటి నుంచి అమలు చేస్తోంది.ఉమ్మడి జిల్లాలో దాదాపు 38 లక్షల మందికిపైగా మహిళలు లబ్ధిపొందనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 11 ఆర్టీసీ డిపోల పరిధిలో 532 పల్లెవెలుగు, ఆల్ట్రాపల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు 191, కోనసీమలో 176 పల్లెవెలుగు, తూర్పుగోదావరిలో పల్లెవెలుగు,ఆల్ట్రాపల్లె వెలుగు,ఇతర బస్సులు 283 ఉన్నాయి.ఎక్స్‌ప్రెస్ బస్సులు వంద వరకు ఉన్నాయి. వీటన్నింటిలోను మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుకానుంది.

హైవేపై హాయిగా...

కేంద్రప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వార్షిక ఫాస్టాగ్ పాస్ అమల్లోకి రానుంది. తద్వారా కేవలం రూ.3 వేల ఫాస్టాగ్ తీసుకుని దేశంలో ఏ హైవేపై ఉన్న టోల్‌ప్లాజా ద్వారా ఫ్రీగా ప్రయాణించవచ్చు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి అమల్లోకి వచ్చింది.ఈ పాస్ ద్వారా ప్రయాణించే వెసులుబాటు కార్లు, వ్యాన్‌లు, జీపులు ఇతర వ్యక్తిగత అవసరాలకు వినియోగించే వాటికే వర్తిస్తుంది. ఈ విధానం వల్ల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వాహనదారులకు భారీగా ప్రయోజనం కలిగించనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదు టోల్‌ప్లాజాలు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉన్నాయి.ఆయా టోల్‌గేట్ల వద్ద నిర్ణీత రుసుంను ఫాస్టాగ్ ద్వారా చెల్లించాలి. వీటితో పాటు తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు వద్ద మరో టోల్ ప్లాజా ఉంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏపీఆర్‌డీసీ ఆధీనంలో ఉంది. ప్రస్తుతం ఈ టోల్‌ప్లాజాల ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి టోల్‌ఫీని వాహనానికి ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లించాలి. ఒక వేళ ఫాస్టాగ్ సొమ్ములు లేకున్నా.ఫాస్టాగ్ లేకున్నా నిర్ణీత రుసుము కంటే 100 శాతం అదనంగా చెల్లించాలి. కొత్త విధానంలో ఫాస్టాగ్ రీచార్జి తరచూ చేసుకునే ఇబ్బంది లేకుండా ఏడాది రుసుం చెల్లించే విధంగా కేంద్రం కొత్త నిర్ణయం తీసుకొచ్చింది. ఈ ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌కు ఏడాదికి రూ.3 వేలు చెల్లించాలి.ఇలా రీచార్జి చేయించిన వాహనం దేశవ్యాప్తంగా ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా 200 సార్లు ప్రయాణించే అవకాశం ఉంది. ఏడాది లేదా 200 సార్లు ఏది ముందైతే దానిని పరిగణనలోకి తీసుకుంటారు.వాణిజ్య అవసరాలకు తిరిగే వాహనాలకు అవకాశం ఉండదు.రాష్ట్ర రహదారులు, ఇతర ప్రాంతాల్లో టోల్‌గేట్ల వద్ద సాధారణ పద్ధతి లో ఫాస్టాగ్ ద్వారా టోల్ ఫీ చెల్లించాలి.తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వద్ద సాధారణ ఫాస్టాగ్ ద్వారానే టోల్‌ఫీ చెల్లించాలి. ఫాస్టాగ్ యాన్యువల్ పాస్ రాజ్‌మార్గ్ యా త్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ అధికారిక వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

టోల్ ఫీజు 15 రూపాయలే..

ఏడాది లేదా 200 సార్లు తిరిగేందుకు వీలుగా ఫాస్టాగ్ తీసుకోవడం వల్ల వాహనదారులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. దీనివల్ల ఒక ట్రిప్పునకు రూ.15 మాత్రమే పడుతుంది. గొల్లప్రోలు టోల్‌ప్లాజా ద్వారా కారు, జీపు, వేన్‌లకు ఒకవైపు రూ.50 రుసుం ఉంది. దీని ప్రకారం 200 సార్లు ఇవి తిరిగితే పాత పద్ధతిలో రూ.10 వేలు అవుతుంది. కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద 200 ట్రిప్పులకు రూ.22 వేలు, ఈతకోట వద్ద టోల్ ప్లాజా వద్ద రూ.25వేలు అవుతుంది. రాష్ట్రంలోని ఇతర టోల్‌ప్లాజాల వద్ద ఇంతకంటే అధిక రుసుములు వసూలు చేస్తున్నారు. నూతన విధానంలో ఒక్కొక్కచోట రూ.15 మాత్రమే కట్ అవుతుంది. దాంతో 200 సార్లకు రూ.3 వేలు చెల్లిస్తే సరిపోతుంది. బ్యాలెన్స్ అయిపోతే మళ్లీ రీచార్జి చేసుకుంటే అదే ప్యాకేజీ వర్తిస్తుంది.

రైతులు పాస్..పాస్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి రైతులకు ప్రభుత్వం కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనుంది. భూసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త పాస్ పుస్తకాలను అధికారులు అందించబోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అసలు పాస్‌పుస్తకాల జారీయే పెద్దగా జరగలేదు. అప్పటి సీఎం జగన్ అస్తవ్యస్త విధానాలతో చేపట్టిన భూసర్వే పేరుతో మరింత తలనొప్పి పెరిగింది.ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ము నుపటిలా ఆంధ్రప్రదేశ్ రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాల జారీకి రెవెన్యూశాఖ నిర్ణయించింది. ఎట్టకేలకు ఇవన్నీ ప్రింటింగ్ పూర్తి చేసుకుని జిల్లాలకు చేరుకున్నాయి. గత వైసీపీ హయాంలో కాకినాడ జిల్లా 15 మం డలాల పరిధిలో 269 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా 19 మండలాల్లో 190 గ్రామాలు, కోనసీమ జిల్లాలో 150 కిపైగా గ్రామాల్లో సర్వే చేశారు. నేటి నుంచి రీసర్వే పూర్తిచేసుకున్న గ్రామాల్లో పం పిణీ చేయనున్నారు.కాకినాడ జిల్లాలో 1.47 ల క్షలు, కోనసీమ జిల్లాలో 1.02 లక్షలు,తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల వరకు పాస్ బుక్‌లు ఇవ్వనున్నారు.ఇకపై స్వేచ్ఛగా రైతులు భూముల క్రయవిక్రయాలు,బ్యాంకు రుణాలు తెచ్చుకోవచ్చు.



పోలీసు కవాతును పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

కాకినాడక్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శుక్రవారం జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను ఎస్పీ జి.బిందుమాధవ్ గురువారం పరిశీలించారు. పోలీస్‌బలగాల కవాతులో ఉన్న లోపాలను గుర్తించి సిబ్బందికి తెలియజేస్తూ వేడుకల్లో బలగాలు మెరుగైన ప్రదర్శన ఇచ్చేలా సలహాలు, సూచనలు చేశారు. ముఖ్యఅతిథికి గౌరవవందనం చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. జాతీయ పతాకానికి గౌరవవందనం చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఏఎస్పీ భాస్కర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ సత్యనారాయణ, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, పెరేడ్ కమాండెంట్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోలీసు పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మైదానంలో ప్రధాన స్టేజి, అతిథులు, సాధారణ ప్రజలు కూర్చునే సీటింగ్ వసతి, స్టాల్స్ ఏర్పాటు, శకటాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఎస్పీ బిందుమాధవ్, జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ మనీషా, డీఆర్‌వో వెంకట్రావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దార్ జితేంద్ర, సమాచార పౌర సంబంధాలశాఖ డీడీ నాగార్జున, ఏఈ ఇన్వర్షన్ ఇంజినీర్ బాబురావు పాల్గొన్నారు.



పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్

స్వాతంత్రోద్యమంలో వారంతా రా'రాజులు'



కాశిన వెంకటరత్నం భూపతిరాజు జగ్గరాజు నడింపల్లి బంగార్రాజు నడింపల్లి జగ్గరాజు నడింపల్లి రామచంద్రరాజు నడింపల్లి సుబ్బరాజు

(ఆంధ్రజ్యోతి - అమలాపురం రూరల్)

భరతమాత దాస్యశృంఖలాలను తెంచేందుకు ఆనాడు ఎందరో స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలంలోని జంట గ్రామాలుగా గుర్తింపు పొందిన వన్నెచింతలపూడి, రంగాపురం గ్రామాలే గుర్తుకు వస్తాయి. ఆ రెండు గ్రామాల నుంచి 17 మంది స్వాతంత్రోద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపినవారే. వారికి అండగా ఎప్పుడూ వందమందికి పైగా అనుచరులు ఉన్నారు. స్వాతంత్రోద్యమ పురిటిగడ్డలు ఆ గ్రామాలు అయితే.. ఉద్యమాన్ని ముందుండి నడిపించింది అందరు రారాజులే. వన్నెచింతలపూడి గ్రామం నుంచి నడింపల్లి కుటుంబీకులే స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపించారు. ఒకే కుటుంబానికి చెందిన నడింపల్లి జగ్గరాజు, భీమరాజు, వెంకటపతిరాజు, రామభద్రరాజు సోదరులు స్వాతంత్రోద్యమంలో కీలకంగా పాల్గొన్నారు. ఒకే కుటుంబం నుంచి నలుగురు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ఘనత ఆ కుటుంబానికే దక్కుతుంది. ఈ గ్రామం నుంచి నడింపల్లి బంగార్రాజు ఆధ్వర్యంలో నడింపల్లి సీతారామరాజు, నడింపల్లి భీమరాజు, నడింపల్లి జగ్గరాజు, నడింపల్లి వెంకటపతి రాజు, నడింపల్లి విశ్వనాధరాజు, నడింపల్లి సుబ్బరాజు(సాధురాజు), నడింపల్లి రామమూర్తి రాజు, నడింపల్లి సత్యనారాయణరాజులతోపాటు భూపతిరాజు సుబ్బరాజులు స్వాతంత్ర్యోద్యమంలో జైలు జీవితం గడిపినవారే. అదేవిధంగా రంగాపురం గ్రామానికి చెందిన భూపతిరాజు జగ్గరాజు ఆధ్వర్యంలో భూపతిరాజు సూర్యనారాయణ రాజు, భూపతిరాజు రామరాజు, భూపతిరాజు రామచంద్రరాజు, భూపతిరాజు వెంకటపతిరాజులతోపాటు నడింపల్లి సత్యనారాయణ రాజు, నడింపల్లి సుబ్బరాజులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జైలు జీవితాలు గడిపినవారే. తమ యావదాస్తులను ఉద్యమానికి అర్పించిన వారే.

జగ్గరాజు ఖైదీ నంబరు 5282

వన్నెచింతలపూడి గ్రామానికి చెందిన నడింపల్లి జగ్గరాజు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు 1930జూలై 8న బ్రిటీషు పోలీసులు అరెస్టు చేశారు. ఆరు నెలలు జైలు శిక్ష విధించగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఖైదీ నంబరు 5282 కింద ఉన్నారు. శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు 1932 జనవరి 18న మరోసారి ఆయన అరెస్టు అయ్యారు. ఆయనకు ఆరు నెలలు జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధించారు. జరిమానా కట్టని పక్షంలో అదనంగా నెల 15 రోజులు జైలుశిక్ష అనుభవించాలని కోర్టు తీర్పు ఇవ్వడంతో బళ్లారిలోని సెంట్రల్ జైలుకు తరలించారు. అప్పట్లో గ్రామంలోని ఐదు ఎకరాల భూమిని విక్రయించి రూ.500 జరిమానా చెల్లించడంతో ఆరు నెలల జైలు శిక్ష అనంతరం విడుదలయ్యారు. బళ్లారిలోని సెంట్రల్ జైలులో జగ్గరాజుతోపాటు నీలం సంజీవరెడ్డి కూడా జైలు శిక్ష అనుభవించారు. వారిద్దరూ జైలుమేట్స్. అనంతర కాలంలో సంజీవరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో జగ్గరాజును గుర్తు పెట్టుకుని మరీ ఆయన యోగక్షేమాలను సంజీవరెడ్డి అడిగేవారు.

సైకిల్‌పై తిరుగుతూ...

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో సైకిల్‌పై తిరుగుతూ ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్న ఘనత నడింపల్లి బంగార్రాజుకు దక్కుతుంది. స్వాతంత్రోద్యమంలో భాగంగా 1930 దశకంలోనే మద్రాసు, రాజమహేంద్రవరం, బళ్లారి సెంట్రల్ జైళ్లలో ఎన్నో నెలలపాటు జైలు శిక్ష అనుభవించారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత బంగార్రాజుతో పాటు పలువురికి కేంద్ర ప్రభుత్వం తామ్రపత్రాలు అందించారు. బంగార్రాజుకు పెన్షన్‌తో పాటు ప్రభుత్వం భూమిని అప్పగించింది. అయితే వాటిని ఆయన తృణప్రాయంగా త్యజించారు. బంగార్రాజుకు కేటాయించిన భూమిని భూదాన ఉద్యమంలో వినోభాబావేకు అప్పగించారు.

ఉత్తరాలపై నిఘా..

స్వాతంత్రోద్యమంలో ఉద్యమవీరులపైనే కాకుండా తపాలాశాఖ ద్వారా బట్వాడా అయ్యే ఉత్తరాలపై కూడా నిఘా పెట్టారు. అప్పట్లో భూపతిరాజు జగ్గరాజు ఉద్యమంలో భాగంగా కొరియర్‌గా పనిచేశారు. పోస్టుకార్డుల ద్వారానే ఉద్యమ సమాచారాన్ని రహస్యంగా పంపిస్తున్నారన్న విషయాన్ని బ్రిటీషు పోలీసులు ఆలస్యంగా గుర్తించి వెంటనే ఉత్తరాలపై సైతం నిఘా పెట్టారు. ఉభయగోదావరి జిల్లాల్లో కొరియర్‌గా పనిచేసిన జగ్గరాజు 1932లో ఉద్యమానికి సంబంధించిన ఉత్తరాన్ని రహస్యంగా తుని చేరవేస్తుండగా పిఠాపురంలో పోలీసులు ఆయన్ను అడ్డగించారు. రహస్య సమాచారాన్ని గుర్తించి జగ్గరాజును తీవ్రంగా కొట్టి పంట పొలాల్లో పడవేశారు. కొన ఊపిరితో ఉన్న జగ్గరాజును స్థానికులు రక్షించడంతోపాటు స్వగ్రామానికి చేర్చారు.

సాధు ఆశ్రమంలోనే వైద్య సేవలు

వన్నెచింతలపూడిలో స్వాతంత్రోద్యమకారుడైన నడింపల్లి సుబ్బరాజు (సాధురాజు) ప్రకృతి వైద్యునిగా పనిచేసేవారు. ఉద్యమంలో ఎవరికి గాయాలైనా ఆ ఆశ్రమానికి తరలించేవారు. వారికి వైద్యసేవలు అందించిన అనంతరం విశ్రాంతి తీసుకునేందుకు మరో ఆశ్రమాన్ని మరికొంత దూరంలో ఆయనే రహస్యంగా ఏర్పాటుచేశారు. స్వాతంత్ర్య యోధులెందరికో వైద్యసేవలను రాజు అందించారు.

మహాత్మునితో కలిసి నడిచిన వెంకటరత్నం

ఆగర్భ శ్రీమంతునిగా జన్మించిన కాశిన వెంకటరత్నం దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్ముడు చూపిన బాటలో నడిచారు. బండారులంకకు చెందిన వెంకటరత్నం 14వ ఏటనే స్వాతంత్రోద్యమ బాటపట్టారు. మహాత్మాగాంధీతో కలిసి జైలు జీవితాన్ని గడిపారు. 1929 మే 5న కోనసీమ పర్యటనకు వచ్చిన మహాత్మునితో కలిసి వెంకటరత్నం పర్యటించారు. వెంకటరత్నం ఉద్యమం కోసం ఆస్తులు తరిగిపోతున్నా పట్టించుకోలేదు. టంగుటూరి ప్రకాశంపంతులు ప్రధాన అనుచరునిగా ఆయన గుర్తింపు పొందారు.



అమరుల నేల 'వాడపల్లి'

దేశభక్తితోపాటు దైవభక్తిని చాటుకున్న నేలగా వాడపల్లి చారిత్రకతను సంతరించుకుంది. 1931 మార్చి 30 ఏకాదశి రోజున శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణంలో భాగంగా రథోత్సవంపై మహాత్మాగాంధీ చిత్రపటాన్ని, జాతీయ పతాకాన్ని దేశభక్తులు ఎరుగవేశారు. గాంధీ చిత్రపటాన్ని, మువ్వెన్నల జెండాను తొలగించాలని బ్రిటీష్ పోలీసు అధికారి ముస్తాఫ్‌ఆలీఖాన్ ఆదేశించారు. దేశభక్తులు ఎంతకీ ససేమిరా అనడంతో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో పలువురు అశువులుబాశారు. కొంతమంది గాయాలపాలయ్యారు. కోపోద్రిక్తులైన దేశభక్తులు.. ముస్తాఫ్‌ఆలీఖాన్ అనుకుని శానటరీ ఇన్‌స్పెక్టర్‌ను హతమార్చారు. 1987 అక్టోబరు 2న గాంధీ జయంతి నాడు మాజీ ఎమ్మెల్యే, గాంధేయవాది మంతెన వెంకట సూర్యసుబ్బరాజు ఆలయం వద్ద స్వాతంత్ర్య సమరయోధుల స్థూపాన్ని ఆవిష్కరించారు. ఇక్కడ రోడ్డు ఇరుకుగా ఉండడంతో కొత్తగా నిర్మిస్తున్న కోనేరు వద్ద స్మారక స్థూపాన్ని మార్పుచేయడానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చర్యలు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి, ఆత్రేయపురం



అలనాటి జ్ఞాపకాలు.. గాంధీజీ మ్యూజియం

స్వాతంత్రోద్యమ సమయంలో 1921 నుంచి 1929 మధ్యలో మూడుసార్లు గాంధీజీ కాకినాడ వచ్చారు. గాంధీజీ ఇక్కడికి వచ్చినప్పటి విషయాలతోపాటు ఆయన బాల్యం నుంచి స్వాతంత్ర్యం సాధించి వరకు ఉన్న జీవిత ఘట్టాలను తెలియజేస్తూ కాకినాడ కార్పొరేషన్ వెనుక ప్రాంతంలో గాంధీభవన్ ఏర్పాటుచేశారు. ఇందులో గాంధీజీ మ్యూజియం, ఆయన చిత్రపటాలతో పాటు 400 కిలోల కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. ఆయనను నిత్యం స్మరించుకునేలా గాంధీనగర్లో ఓ పార్కుకు గాంధీపార్కుగా, ఓ ప్రాంతానికి గాంధీనగర్‌గా అప్పట్లోనే నామకరణం చేశారు. కాకినాడ గాంధీభవన్ పేరున కరపలో 5.87 ఎకరాల భూమి ఉంది. వేళంగి గ్రామానికి చెందిన మెర్ల వెంకట సుబ్బారావు 1952 ఆగస్టు 5న తన స్వార్జిత భూమిని గాంధీ భవన్ ట్రస్టుకు రాసిచ్చారు. ఇక కాకినాడలో గాంధీ మూడుసార్లు పర్యటించారు. 1921 ఏప్రిల్ 3న కాకినాడలో గాంధీజీ దంపతులు, వారి నాలుగో కుమారుడు రైలు దిగి గుర్రపు బండిపై జగన్నాథపురంలోని పైడా వెంకట నారాయణ ఇంటికి చేరుకున్నారు. 1923 డిసెంబర్ 28న గాంధీనగర్లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సభలకు నెహ్రూ, పటేల్ వంటి నేతలు విచ్చేయగా, పరవాడ జైలులో ఉన్న కారణంగా గాంధీ హాజరు కాలేదు. ఆ తర్వాత 1930, 1933ల్లో రెండు సార్లు కాకినాడ వచ్చారు.

- ఆంధ్రజ్యోతి, కాకినాడ కార్పొరేషన్

తొలిరోజు పండుగ ఇలా..



టంగుటూరి ప్రకాశంపంతులు ఆధ్వర్యంలో అప్పట్లో వెలువడిన స్వరాజ్య పత్రికలోనే స్వాతంత్రోద్యమ సమాచారమంతా ఉండేది. అటువంటి మహనీయునితోపాటు క్రొవ్విడి లింగరాజు, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం, డాక్టర్ నాగేశ్వరరావు, కళా వెంకట్రావు వంటి సమరయోధులను చూడగలిగాను. 1930 మే31న జన్మించాను. రాజమహేంద్రవరం ట్రైనింగ్ కళాశాలలో ఎస్ఎస్ ఎల్సీ పూర్తిచేసి 1947లో ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో చేరాను. అదే సంవత్సరం ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత దేశానికి స్వాంత్రంత్యం ప్రకటించారు. 15వ తేదీ ఉదయం నుంచి కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది. తామంతా జాతీయ పతాకాలను చేతబూని ర్యాలీలు నిర్వహించాం.

- చీర్ల సాంబశివరావు, విశ్రాంత హెచ్‌ఎం, అమలాపురం



పేరూరు హైస్కూలులో ఫోర్తుఫారం చదువుతున్నా. ఎలా తెలిసిందో ఏమో 1947 ఆగస్టు 15వ తేదీ ఉదయం 5 గంటలకల్లా విద్యార్థులంతా పాఠశాలకు రావాలని ముందే హెచ్‌ఎం చెప్పారు. చెప్పినట్టుగానే పాఠశాలకు వెళ్లగా అక్కడంతా పండుగ వాతావరణమే. మహాత్మాగాంధీకి జై, వల్లభాయ్ పటేల్‌కు జై, సుభాష్‌చంద్ర బోస్‌కు జై, నెహ్రూకు జై అంటూ విద్యార్థులంతా కలిసి జాతీయ పతాకాలను చేతబూని గ్రామమంతా ర్యాలీ నిర్వహించాం. ఉదయం అల్పాహారం అనంతరం స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపుతూ దేశభక్తిని చాటేలా ప్రదర్శనలు ఇచ్చారు. 1933 ఫిబ్రవరి 22న జన్మించిన నేను స్వాతంత్ర్య తొలి వేడుకల్లో పాల్గొనడం అదృష్టం.

- యిళ్ల వెంకట శ్రీనివాసరావు, విశ్రాంత డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, అమలాపురం

మహాత్ముడు నడిచాడిచట.. 1933లో మహాత్మాగాంధీ సామర్లకోట రాక

మహాత్మాగాంధీ 1933లో సామర్లకోటలో పర్యటించారు. మహాత్ముడు తన శిష్య బృందంతో కలసి కలకత్తా(హౌరా) నుంచి మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైలులో సామర్లకోట రైల్వే స్టేషన్‌కు డిసెంబరు 24న ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫాం నుంచి రైలు దిగిన గాంధీని చూసేందుకు జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో ప్రజలు, అభిమానులు చేరుకోవడంతో సామర్లకోట రైల్వే స్టేషన్ ప్రజలతో కిక్కిరిసింది. అప్పటి కాంగ్రెస్ నాయకులు, భారత స్వాతంత్రోద్యమంలో కీలకపాత్ర పోషించిన స్వాతంత్ర్య సమరయోధులు బులుసు సాంబమూర్తి తదితర నాయకుల ఆధ్వర్యంలో మహాత్మాగాంధీని ఘనంగా స్వాగతించారు. సామర్లకోట నుంచి ప్రత్యేక వాహనంపై ఆశీనులైన మహాత్మాగాంధీ పెద్దాపురం తరలివెళ్లారు. పెద్దాపురంలో ముప్పనవారి బంగ్లా ఆవరణలో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. సుమారు పదిహేను వేల మంది సమీప ప్రాంతాల నుంచి ఈ సభకు హాజరుకావడం విశేషం. నాటి సభ ముగిసిన అనంతరం పెద్దాపురం మున్సిపాల్టీ పక్షాన చైర్మన్ ఎస్.సుబ్బారావుతో స్వాగతపత్రాన్ని, పౌరుల తరపున మరొక సన్మానపత్రాన్ని సభాముఖంగా చదివి వినిపించి అందించారు. అనంతరం గాంధీకి హరిజననిధికి రూ.501 విరాళాన్ని అందజేశారు.

- ఆంధ్రజ్యోతి, సామర్లకోట



నాగుల్లంకలో ఏర్పాటుచేసిన స్థూపం

సమరయోధుల గ్రామం నాగుల్లంక



స్వాతంత్ర్య సమరయోధుడు ఆరుమిల్లి సుబ్బారావుకు 1972లో ప్రభుత్వం అందించిన తామ్రపత్రం

స్వాతంత్ర్య ఉద్యమం జరిగిన సమయంలో పి.గన్నవరం మండలం నాగుల్లంక గ్రామానికి చెందిన 22 మంది వ్యక్తులు సమరంలో పాల్గొని దేశానికి స్వతంత్రం సంపాదించడంలో భాగస్వాములయ్యారు. అందుకుగాను అప్పట్లో ప్రభుత్వం 22 మందిలో ఐదుగురికి తామ్రపత్రాలు అందించి ఘనంగా సత్కరించారు. ఒకే గ్రామంలో 22 మంది స్వాతంత్ర సమరయోధులు ఉండడంతో ఆనాటి నుంచి ఆ గ్రామం స్వాతంత్ర సమరయోధుల గ్రామంగా ప్రసిద్ధిగాంచింది. అంతే కాకుండా స్వతంత్ర సమరంలో చేసిన సేవలకు గుర్తుగా ప్రధానపంటకాల్వకు వంతెన, కాల్వ చెంతనే వారి పేర్లతో స్థూపాన్ని ఏర్పాటుచేసి ప్రతి ఏడాది స్థానిక నాయకులతో కలసి గ్రామస్తులు ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగురవేసి వారికి నివాళులు అర్పిస్తారు.

- ఆంధ్రజ్యోతి, పి.గన్నవరం



రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

పిఠాపురంలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు

పిఠాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాత బస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాలుగు రోజులు జరిగే రాష్ట్ర స్థాయి 10వ జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. కొంతసేపు బాస్కెట్‌బాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో బాలబాలికల విభాగాల్లో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్ పి.సురేష్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు), పిఠాపురం అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారులు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, కొత్తెం సుందరకుమార్, నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



బాలికల విభాగంలో తలపడుతున్న క్రీడాకారులు

గైనిక్ పేషెంట్లకు ప్రత్యేక ఓపీ

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గైనిక్ పేషెంట్ల సౌకర్యార్థం కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి గురువారం తెలిపారు. గైనిక్ విభాగంలోని ఎస్ఆర్ఎంటీ బ్లాక్ వద్ద తల్లీబిడ్డ విగ్రహం ఎదురుగా ఉన్న గేటులోకి రావాలన్నారు. ఓపీ టికెట్, డాక్టర్ కన్సల్టేషన్, రక్త పరీక్షలు, మందులు అన్నీ ఎస్ఆర్ఎంటీ బ్లాక్ వద్దే జరిగేలా ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ వెల్లడించారు. ప్రజలు ఈ మార్పును గమనించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దుబాయ్‌లో వెల్డర్స్‌గా ఉద్యోగావకాశాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దుబాయ్ (యూఏఈ) దేశంలో వెల్డర్స్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. వయసు 24 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండి, ఐటీఐ లేదా ఐటీసీ విద్యార్హత కలిగి నాలుగేళ్ల అనుభవం ఉండాలన్నారు. టీజీ లేదా ఏఆర్సీ మల్టీ వెల్డర్ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ. 52వేల నుంచి రూ.61,500, టీజీ లేదా ఏఆర్సీ వెల్డర్ ఉద్యోగానికి రూ.42,500 నుంచి రూ.52వేల వరకు వేతనం ఇస్తారన్నారు. కాంట్రాక్ట్ కాలం రెండేళ్లు ఉంటుందన్నారు. ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యాలతో పాటు స్వదేశానికి ఒకసారి వచ్చి వెళ్లడానికి టిక్కెట్ ఇస్తారన్నారు. రూ.35వేలు (వీసా, ట్రావెల్ టికెట్లు, క్యూవీసీ మొదలైన ఖర్చులకు). ఆసక్తి గల వారు పాస్‌పోర్టు, అనుభవం, సంబంధిత విద్యా ధ్రువపత్రాలతో ఆగస్టు 31వ తేదీలోగా వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8712655686, 9988853335, 8790118349, 8790117279 నెంబర్లను సంప్రదించాలని కోరారు..



డేవిడ్



హెబెల్

జాతీయ హాకీ పోటీలకు ఉప్పాడ కొత్తపల్లి విద్యార్థుల ఎంపిక

కొత్తపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లికి చెందిన చొక్కా డేవిడ్, మేరుగు హెబెల్ జాతీయ హాకీ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల పీడీ, హాకీ కోచ్ రవిరాజు తెలిపారు. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో ప్రారంభమైన 15వ హాకీ ఇండియా జూనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో వారు పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారులకు టేబుల్ టెన్నిస్ సీనియర్ క్రీడాకారుడు రావు చిన్నారావు, జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాసరావు, గంటా విజయ్‌కుమార్, పలువురు గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

నేనూ ర్యాగింగ్‌కు భయపడ్డా..



కలెక్టర్ ప్రశాంతికి జ్ఞాపిక అందజేస్తున్న వీసీ, విద్యార్థులు

- అది ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది
- తూర్పు కలెక్టర్ ప్రశాంతి
- నన్నయ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాలు

దివాన్‌చెరువు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తన జీవితంలో కూడా ర్యాగింగ్‌కు భయపడిన సంఘటనలు ఉన్నాయని, ర్యాగింగ్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాల్లో మూడో రోజైన గురువారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ర్యాగింగ్ ఉండని విద్యాలయాల్లో తమ పిల్లలను చేర్చడానికి తల్లిదండ్రులు ఇష్టపడతారని, పిల్లలు కూడా అటువంటి వాటిలో చేరడానికే సుముఖత చూపిస్తారన్నారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు భయపడి విద్యకు దూరమైన విద్యార్థులు అనేక మంది ఉన్నారన్నారు. తాను చదువుకునేటప్పుడు ర్యాగింగ్‌కు భయపడి సెలవులు పెట్టిన సందర్భాలు ఉన్నాయని, అటువంటి పరిస్థితులు ఏ విద్యార్థికి రాకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయాల గౌరవం, పేరు ప్రఖ్యాతులు విద్యార్థుల ప్రవర్తనపై ఆధారపడి ఉంటాయని, సీనియర్ విద్యార్థులు జూనియర్ల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని, మార్గనిర్దేశకులుగా వ్యవహరించాలని సూచించారు. నన్నయ వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ర్యాగింగ్ ఒక వ్యక్తి మనస్సును మచ్చగా మార్చుతుందని, వారి కలలను పూర్తిగా నాశనం చేసే హానికరమైన చర్య అని అభివర్ణించారు. యూనివర్శిటీలో భయానికి స్థానం లేదని. ఆకాంక్ష, గౌరవం మాత్రమే ఉండేలా చూసుకుందామని చెప్పారు. రాజానగరం మహిళా ఎస్ఐ పి.నారాయణమ్మ శక్తి యాప్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తొలుత నన్నయ విగ్రహానికి కలెక్టర్, వీసీ పూలమాలలతో నివాళులర్పించారు.అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమం అనంతరం కలెక్టర్ ప్రశాంతిని వీసీ సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ కేవీ స్వామి, డీన్ ఎన్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ మురళీకి మహోన్నత సేవా పతకం



రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో చేసిన సేవలకు జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన) ఎన్‌బీఎం మురళీకృష్ణకు రాష్ట్ర ప్రభుత్వ మహోన్నత సేవా పతకం లభించింది. 1989లో ఎస్ఐగా సర్వీసులో చేరిన మురళీ.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పలు హోదాల్లో పని చేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. నరసాపురం డీఎస్పీగా పని చేస్తూ అడిషనల్ ఎస్పీ ఉద్యోగోన్నతిపై తూర్పు గోదావరికి గత ఏడాది నవంబరులో వచ్చారు. మండపేట రూరల్, అంగర, పెదవేగి, చందర్లపాడు, అనపర్తి సర్కిల్, రాజమండ్రి టూటౌన్ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న సమయంలో స్థానికుల సహకారంతో పోలీస్ స్టేషన్ భవనాలను నిర్మించారు. హైదరాబాద్‌కు చెందిన ఒక కేసు ఛేదనలో అద్వితీయమైన ప్రతిభ చూపినందుకు రూ.5 లక్షల రివార్డు అందుకున్నారు. 2009లో ఏలూరులో ఎలక్షన్ స్పెషల్ బ్రాంచి సీఐగా ఉన్నప్పుడు సేవా పతకం, 2017లో రామచంద్రాపురంలో డీఎస్పీగా ఉన్నప్పుడు ఉత్తమ సేవాపతకం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ కిషోర్, అడిషనల్ ఎస్పీలు అర్జున్(క్రైమ్స్), సుబ్బరాజు(శాంతి భద్రతలు), చెంచురెడ్డి(ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది మురళీ కృష్ణకు అభినందనలు తెలిపారు.

'ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలి'

వివిధ జిల్లాల ఆర్టీసీ ఆన్‌కాల్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పిఠాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గురువారం కాకినాడ జిల్లా పిఠాపురంలోని జనసేన కార్యాలయానికి వచ్చారు. తమ సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరుతూ జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రతినెలా వేతనంతో పాటు పీఎఫ్, ఈహెచ్ఎస్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. తమకు సరైన వేతనం లేదని, పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తే సమస్యలు పరిష్కారమవుతాయని ఇక్కడకు వచ్చామని వారు చెప్పారు.

పెరుగుతున్న గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పాటు తెలంగాణ పరివాహకంలో లక్ష్మి బ్యారేజ్ నుంచి సుమారు 3లక్షల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండడంతో గోదావరి ప్రవాహం స్వల్పంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నుంచి 1,98,959 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. డెల్టా పరిధిలో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల డెల్టా కాలువలకు సాగునీటి విడుదలను గణనీయంగా తగ్గించారు. తూర్పు డెల్టాకు 2000, మధ్య డెల్టాకు 700, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం గురువారం సాయంత్రానికి 19.60 అడుగులుగా నమోదయింది.

రేపు, ఎల్లుండి పోలవరం నిర్వాసిత ప్రాంతాల్లో

సీపీఎం నాయకుల పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఈ నెల 16, 17 తేదీల్లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నారని తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎం నాయకులు 16వ తేదీ ఉదయం 11గంటలకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి పోలవరం దేవీపట్నం మండలంలో నిర్వాసిత గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. 17న చింతూరు మండలంలోని నిర్వాసితుల కాలనీల్లో పర్యటిస్తారని తెలిపారు.



స్వాతంత్ర్య సందేశం..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కడియం పల్ల వెంకన్న నర్సరీలో రైతులు సత్తిబాబు, వెంకటేష్, వినయ్ మొక్కలతో త్రివర్ణ పతాకం తీర్చిదిద్దారు. బోర్డర్ రకానికి చెందిన కొన్ని వేల మొక్కలతో మేడిన్ ఇండియా, ఇండిపెండెన్స్ వంటి అక్షర రూపాలు ఇవ్వడంతో పాటు 3రంగుల జెండా తీర్చిదిద్దారు. కూర్పులో 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలను తెలుపుతూ అమెరికా వంటి సంపన్న దేశాలు తీసుకున్న నిర్ణయంతో రూపాయి విలువ తగ్గకుండా మనమే స్వదేశీ వస్తువులకు కొనుగోళ్లకు ప్రాధాన్యమివ్వాలని సందేశం ఇచ్చారు.

– కడియం (ఆంధ్రజ్యోతి)

ఆనాటి ప్రయాణం.. నేటి ఉచితానికి మార్గం!

- కోనసీమ జిల్లా ఆలమూరులో రెండేళ్ల క్రితం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసిన చంద్రబాబు
- ఉచిత బస్సు సౌకర్యం హామీపై ప్రయాణికులతో చర్చ
- స్త్రీ శక్తి పథకానికి అదే స్ఫూర్తి





ఆలమూరులో రెండేళ్ల క్రితం బస్సులో ప్రయాణం చేసిన చంద్రబాబు చిత్రాలు

ఆలమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలందరికీ ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి ఈ పథకం అమలులోకి వచ్చింది. స్త్రీశక్తి పేరుతో ఈ పథకాన్ని రూపొందించారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ 5 రకాల బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడైనా ఉచితంగా మహిళలు ప్రయాణించవచ్చు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండల పర్యటనకు వచ్చినప్పుడు ఆలమూరు నుంచి జొన్నాడ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ఉచిత బస్సు సౌకర్యం హామీకి సంబంధించి మహిళా ప్రయాణికులతో చర్చించారు. 2023 ఆగస్టు 18న ఈ బస్సు ప్రయాణం చేశారు. ఈ పథకం రూపకల్పనకు సంబంధించి అనేక మంది మహిళా ప్రయాణికులతో ఆయన సమీక్షించి సూపర్ సిక్స్ హామీగా చేర్చారు. ఇప్పుడు ఆ పథకం అమలు చేస్తుండడంతో కొత్తపేట నియోజకవర్గంలో అప్పటి చంద్రబాబు ఆలమూరు బస్సు ప్రయాణం గుర్తించి చర్చించుకుంటున్నారు. ఉచిత బస్సు పథకానికి ఆలమూరు బస్సు ప్రయాణం స్ఫూర్తిగా భావిస్తున్నారు. ఆ ప్రయాణంలో చంద్రబాబు నాయుడుతో పాటు ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, మాజీ జడ్పీటీసీ దండంగి మమత తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ముగ్గురి అరెస్ట్

34 వాహనాలు స్వాధీనం

డీఎస్పీ రమేశ్ బాబు



రాజమహేంద్రవరంలో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రమేశ్‌బాబు

రాజమహేంద్రవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీసులు ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసి 34 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేశ్‌బాబు గురువారం వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గామన్ బ్రిడ్జి వద్ద త్రీటౌన్ సీఐ వి.అప్పారావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో పోలీసులు ప్రశ్నించారు. ద్విచక్రవాహనాల దొంగతనాల కేసుల్లో వాళ్ల నిందితులుగా ఉన్నారని గుర్తించారు. దీంతో తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన కుప్పాల రంగారావు, స్నేహితులు గోపిరెడ్డి యోహాను, మెకానిక్ సిర్రా బంగారుబాబును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేశారు. త్రీటౌన్, భీమవరం, గుడివాడ, ఏలూరు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి 17 మోటారు సైకిళ్లతో కలిపి రూ.14లక్షల విలువైన మొత్తం 34 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. విధుల్లో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ వి.అప్పారావు, ఎస్ఐ వి.అప్పలరాజు, హెచ్ సీలు వి.కృష్ణ, ఎస్.వెంకటరామయ్య, కె.సురేశ్, చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు బి.విజయ్‌కుమార్, మహేశ్, పవన్‌ని ఎస్పీ నరసింహ కిశోర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఇకపై అందరికీ ఒకే నియమావళి!

- ఎన్‌టీఆర్ భరోసా పింఛను అర్హత ధ్రువీకరణ పత్రాల మంజూరుకు నిబంధనలు విడుదల
- రాష్ట్రమంతా ఒకే నియమావళిని వర్తింపజేసేందుకు ఉత్తర్వులు జారీ
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పథకంలో అర్హులను గుర్తించి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసేందుకు రాష్ట్రమంతా ఒకే నియమావళిని వర్తింపజేసేందుకు ఉత్తర్వులు జారీ అయినట్టు కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో వివిధ దీర్ఘకాలిక వ్యాధుల బారినపడే వారిని నెలవారీ పెన్షన్లకు అర్హులుగా గుర్తిస్తామని డీఎంహెచ్‌వో వెల్లడించారు.

దీర్ఘకాలిక రుగ్మతలు, వాటికి వర్తించే పెన్షన్ల వివరాలివి..

రూ.10వేల పింఛను కేటగిరీ అర్హులు: తలసేమియా మేజర్ వ్యాధిగ్రస్తులు, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు, అతి తీవ్ర హిమోఫీలియా వ్యాధిగ్రస్తులు, రెండు కాళ్లకు తీవ్ర బోద(గ్రేడ్-4) వ్యాధిగ్రస్తులు, 7 దీర్ఘకాలిక కిడ్నీవ్యాధితో డయాలసిస్ జరుగుతున్న, సీరం క్రియాటినిన్ 5కంటే ఎక్కువ లేదా కుంచించుకుపోయిన కిడ్నీ లేదా జీఎఫ్ఆర్ 15ఎంఎల్ కంటే తక్కువగా ఉన్న వ్యాధిగ్రస్తులు, కిడ్నీ లేదా కాలేయం లేదా గుండె మార్పిడి చేయించుకున్నవారు.

రూ.15వేల పింఛను కేటగిరీ అర్హులు: పక్షవాతంతో మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తులు, సివియర్ మస్క్యులర్ డిస్ట్రోఫీతో మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తులు.

రూ.6వేల పింఛను కేటగిరీ అర్హులు: బహుళ వైకల్యం కలిగిన కుష్ఠు వ్యాధిగ్రస్తులు, 40శాతం పైబడి దివ్యాంగత్వం ఉండి తెల్లరేషన్‌కార్డు కలిగినవారు.

పైఅనారోగ్యాలు కలిగిన వారికి ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పథకంలో అర్హులను గుర్తించేందుకు ధ్రువపత్రాలు మంజూరుకు రాష్ట్రమంతా ఒకే నియమావళి ఉంటుందని, ధ్రువపత్రాల దాఖలు చేయడానికి ఈ కింది నిబంధనలు పాటించాలని డీఎంహెచ్‌వో తెలియజేశారు.

1. అర్హులకు జారీ చేసిన సర్టిఫికెట్లు అన్నీ పూర్తి సమాచారంతో ఉండాలి.
2. మెడికల్ సర్టిఫికెట్లపై ఏ రకమైన దిద్దుబాట్లు ఉండకూడదు.
3. మెడికల్ సర్టిఫికెట్‌పై జారీ చేసే ఆంధ్రప్రదేశ్ మెడికల్ బోర్డ్ డాక్టర్ల సంతకంతోపాటు స్టాంప్, పేరు, డాక్టర్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలి.
4. ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పథకంలో పైఅనారోగ్య విభాగాల్లో రోగి ఏ కోవకు చెందుతాడో వివరించి మంచానికి లేదా చక్రాల కుర్చీకే పరిమితమయ్యాడో తెలియజేసే ధ్రువీకరణ పత్రంలో పొందుపర్చాలి.
5. ఇప్పటికే ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పొందుతున్న వారు, వారి పింఛను పెంచుకోవాలనుకుంటే సదరం ద్వారా నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందేందుకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసేవారు కూడా సదరం పోర్టల్‌లో నమోదు చేసుకుని నూతన మెడికల్ సర్టిఫికెట్ దాఖలు చేయాలని డీఎంహెచ్‌వో సూచించారు.
6. తీవ్ర అనారోగ్యంతో మంచానికి పరిమితమైన రోగులు అనవసరంగా కార్యాలయం చుట్టూ తిరగవద్దని ఆయన తెలిపారు. దీనిపై మరింత సమాచారం కావాల్సిన వారు డీఎంహెచ్‌వో కార్యాలయంలోని ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛన్ల డీఈవో(కాకినాడ జిల్లా)ను 7981604 598 నెంబరులో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ కోరారు.

రామచంద్రపురం జడ్పీటీసీ మేర్నీడి మృతి



మేర్నీడి (ఫైల్)

ద్రాక్షారామ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండల జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు(59) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరపున జడ్పీటీసీగా వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ద్రాక్షారామ పీఏసీసీఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు. మేర్నీడి మృతి పట్ల మంత్రి సుభాష్, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంతాపం తెలిపారు. మృతదేహానికి మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, ఏపీఐడీసీ మాజీ డైరెక్టరు శ్యామ్, ఎంపీపీ అంబటి భవానీ నివాళులర్పించారు.

హోంగార్డుపై అత్యాచారం కేసు

ముమ్మిడివరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హైవే మొబైల్ వాహనంపై పనిచేస్తున్న హోంగార్డుపై గురువారం ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదైంది. కోనసీమ జిల్లా కాట్రేనికోన పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా ఉన్న బి.నాగరాజు హైవే మొబైల్ వాహనంపై పనిచేస్తున్నాడు. ముమ్మిడివరానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో ఆమె ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. న్యాయం జరగడంలో జాప్యంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీంతో ముమ్మిడివరం పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు.

'నగరం'లో అర్బయిన్ కార్యక్రమాలు ప్రారంభం

మామిడికుదురు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇరాక్‌లోని కర్బలా పుణ్యభూమిలో ఇమామ్ హుస్సేన్ అతని 72 మంది పరివారం వీర మరణం పొందిన సంఘటన జరిగిన 40 రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం నిర్వహించే అర్బయిన్ కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరంలో ఇమామ్ అలీరజా పంజాలో మజ్లిస్ జరిగింది. అనంతరం హమారీలను తీసి నౌహాలను ఆలపిస్తూ ఒంటెలపై నగరంలోని మంజిలే కర్బలా వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ ఉరుహేతాజ్‌దారే పురాత్ ఆధ్వర్యంలో మజ్లిస్ జరిగింది. ఈ మజ్లిస్‌లో మత గురువు కర్బలా పుణ్యభూమిలో జరిగిన సంఘటనను భక్తులకు వివరించగా కన్నీరుమున్నీరుగా విలపించారు. కార్యక్రమాల్లో అధికంగా భక్తులు పాల్గొన్నారు.



కోనసీమ జిల్లా నగరంలో ఒంటెలపై హమారీలు ఊరేగింపు చేస్తున్న ముస్లింలు

ఆసుపత్రికెళ్తుండగా ఆగిన ఆయువు

వ్యాన్ ఢీకొని తండ్రి మృతి

సురక్షితంగా బయటపడ్డ కుమారుడు



బాలకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

తాళ్లరేవు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం బైపాస్ వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. కాజులూరు మండలం శీలలంక గ్రామానికి చెందిన జల్లి బాలకృష్ణ (45) తన మూడేళ్ల కుమారుడికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో కుమారుడిని తీసుకుని ద్విచక్రవాహనంపై ముమ్మిడివరం ఆసుపత్రికి బయల్దేరాడు. వారి వాహనాన్ని సుంకపాలెం మంగళ్‌ఎంటర్‌ప్రైజెస్ ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన బొలెరో వ్యాన్ ఢీకొంది. దీంతో బాలకృష్ణ తలకు బలమైన గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు సురక్షితంగా బయటపడ్డాడు. బాలకృష్ణ భార్య 6నెలల గర్భిణి అని తెలిసింది. బాలకృష్ణ మృతదేహాన్ని అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవన్, మోహన్‌బాబు సినిమాలకు పాటలు రాశా

ప్రముఖ సినీగేయ రచయిత మాస్టర్‌జీ



ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కలిసిన ప్రముఖ సినీ గేయ రచయిత మాస్టర్‌జీ

పి.గన్నవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమ గీతాలకు సంబంధించి ఇప్పటి వరకు 1000 వరకు పాటలు రాశానని ప్రముఖ సినీగేయ రచయిత గంగాధరి మాస్టర్‌జీ అన్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కలిసిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఇప్పటివరకు 25 సినిమాల్లో పాటలు రాశానని... ముఖ్యంగా పవన్‌కల్యాణ్, మోహన్‌బాబు సినిమాలకు పాటలు రాశానని చెప్పారు. రంగులకల, అడవి నాతల్లిరో, మనో రమ సినిమాల్లో పాటలు పాడానని, 6 సినిమాల్లో నటించానని చెప్పారు. ముఖ్యంగా తాను రాసిన అందుకో దండాలు బాబా అంబేడ్కరా, పవన్ కల్యాణ్ నటించిన జానీ సినిమాలో నారాజు గాకుర మా అన్నయా, గుడుంబా శంకర్ సినిమాలో కిల్లి కిల్లి నమిలాకా బాగున్నదే నాగమల్లి పాటలకు మంచి స్పందన వచ్చిందని ఆయన చెప్పారు. తెలుగు యునివర్శిటీ, ఆచార్య నాగార్జున యునివర్శిటీ, తెలుగు అకాడమీల నుంచి అవార్డులు పొందానని చెప్పారు. ప్రస్తుతం రెండవగది సినిమాతో పాటు మరో కొత్త సినిమాకు పాటలు రాస్తున్నాని చెప్పారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లోని జరగనున్న విశ్వజన కళామండలి 49వ వార్షికోత్సవ కార్య క్రమానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ఆహ్వానించడానికి వచ్చినట్టు మాస్టర్‌జీ పేర్కొన్నారు.

అంబులెన్స్ ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు

కరప, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో గురువారం మధ్యాహ్నం అంబులెన్స్ ఢీకొని విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కరప పోలీసుల వివరాల ప్రకారం.. వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పి.పవన్‌భాస్కర్ హెచ్ఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. లంచ్ బ్రేక్ సమయంలో కళాశాల బయటకు వచ్చి రోడ్డుపక్కన ఉన్న షాపు వద్దకు వెళ్లి వస్తుండగా కాకినాడ నుంచి మండపేటకు డిశ్చార్జ్ పేషెంట్‌ను తీసుకెళ్తున్న అంబులెన్స్ వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. విద్యార్థి తలకు తీవ్రగాయమవ్వగా అధ్యాపకులు స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమచికిత్స చేయించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబులెన్స్‌ను స్థానికులు వెంబడించి నిత్యానందపురంసెంటర్‌లో అదుపులోకి తీసుకుని డ్రైవర్, అంబులెన్స్‌ను కరప పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

కిలోలు 100 ధర రూ.8,800

అంతర్వేదిలో భారీ సొర చేప

అంతర్వేది, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరులో వేటకు వెళ్లిన మత్స్యకారులకు అరుదైన భారీ సొర చేప వలకు చిక్కింది. 100 కిలోల పైనే ఉన్న చేపకు వేలం పాట నిర్వహించగా రూ.8,800కు పలికింది.



కొబ్బరిముక్కలు.. కోట్లు!

సత్యదేవుడి సన్నిధిలో కొబ్బరిముక్కలు పోగు చేసుకునేందుకు బహిరంగ వేలం

ఏడాదికి రూ.2.28 కోట్లు చెల్లించేందుకు గుత్తేదారు హెచ్చుపాట

అన్నవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొబ్బరిముక్కలు సత్యదేవుడికి సిరులు కురిపించాయి. స్వామివారి దర్శనం వ్రతమండపాల్లో భక్తులు టెంకాయిలు కొట్టి వదిలివెళ్లిన కొబ్బరిముక్కలు పోగు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలంలో ఒక గుత్తేదారు ఏకంగా సంవత్సరానికి రూ.2.28 కోట్లు దేవస్థానానికి చెల్లించేందుకు హెచ్చుపాటను దక్కించుకున్నారు. గతేడాది వేర్వేరుగా నిర్వహించిన వేలంలో ఏడాదికి హెచ్చుపాట రూ.87.12 లక్షలు కాగా ఈ ఏడాది భారీస్థాయిలో ఆదాయం సమకూరింది. వీటితోపాటుగా బుకింగ్‌కౌంటర్ ఎదురుగా ఉన్న షాపింగ్‌కాంప్లెక్స్‌లో కొబ్బరికాయలు, ఇతర వస్తువులు విక్రయించుకునే లైసెన్స్‌హక్కుకు శుక్రవారం నిర్వహించిన వేలం ద్వారా ఏడాదికి రూ.45.47 లక్షలు హెచ్చుపాట దక్కించుకున్నారు. గతంలో ఇదే లైసెన్స్‌హక్కుకు రూ.27.96 లక్షలు మాత్రమే ఆదాయం సమకూరింది. ప్రకాష్‌సదన్ వెనక ప్రారంభించనున్న మొబైల్ క్యాంటీన్ లైసెన్స్ హక్కుకు తొలిసారి వేలం నిర్వహించగా రూ.33.84 లక్షలకు హెచ్చుపాట ఖరారయ్యింది. జ్యూస్‌పాయింట్ విక్రయ లైసెన్స్ హక్కు తక్కువ మొత్తానికి వెళ్లడంతో ఆ లైసెన్స్ హక్కు వేలం వాయిదా వేశారు. దేవదాయ కమిషనర్ అనుమతితో టెండర్లు ఫైనల్ చేస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సూపరెంటెండెంట్ వీపీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నవరంలో ఉచిత వరలక్ష్మి వ్రతాలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం ఉచిత సామూహిక శ్రావణ శుక్రవార వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు నిత్యకల్యాణ మండపంలో ప్రారంభమవుతాయని, ఆసక్తి కలిగిన మహిళా భక్తులు వీటిలో పాల్గొనవచ్చన్నారు. మహిళలు టెంకాయి, అరటిపళ్లు తీసుకునివస్తే పూజాసామగ్రి, రవికల వస్త్రం, అమ్మవారి రాగిరూపు తదితర వాటిని దేవస్థానం సమకూరుస్తుందని ఈవిషయాన్ని గమనించాలని కోరారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

డ్రైవర్‌కు గాయాలు



ఘటనా స్థలంలో ఆటో,బస్సు.. ఆటోడ్రైవర్

ముమ్మిడివరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్న సంఘటనలో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం కోనసీమ జిల్లా అమలాపురం నుంచి ఐ.పోలవరం మండలం తిలకుప్ప వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముమ్మిడివరం మండలం ఆర్టీసీ సెంటర్‌లో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోడ్రైవర్ అయిన కాట్రేనికోన మండలం దొంతికుర్రుకు చెందిన ఎలిపే కిశోర్ తీవ్రంగా గాయపడ్డాడు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముచ్చటగా ముగ్గురు..

ఒకే కాన్పులో ఒక మగ, ఇద్దరు ఆడపిల్లల జననం... కొత్తపేటలో అరుదైన సంఘటన



తల్లి దుర్గ



ఒకే కాన్పులో పుట్టిన పిల్లలు

కొత్తపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో గురువారం అరుదైన సంఘటన జరిగింది. మహిళకు ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలు జన్మించారు. ఈదరపల్లికి చెందిన కుంపట్ల దుర్గ గర్భిణి కావడంతో కొత్తపేటలోని భాస్కర చిల్డ్రన్ ఐవీఎం ఆసుపత్రి వైద్యుడు ప్రదీప్తికరుణను సంప్రదించింది. స్కానింగ్‌లో ముగ్గురు శిశువులు ఉండడాన్ని గుర్తించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆమెకు 8 నెలలకే నొప్పులు రావడంతో గురువారం ఆపరేషన్ ద్వారా మగబిడ్డ, ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. తల్లి, పిల్లలు క్షేమంగా ఉన్నారని.. పర్యవేక్షణలో ఉంచామని డాక్టర్ ప్రదీప్తికరుణ తెలిపారు.

జాతీయస్థాయి పారా ఒలింపిక్ పోటీలకు ముమ్మిడివరం విద్యార్థి



పార్థసంజీవ సాగర్

ముమ్మిడివరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం కొత్తలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి సబ్బతి పార్థసంజీవసాగర్ జాతీయస్థాయి పారా ఒలింపిక్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడు గంగుల సురేష్ తెలిపారు. ఏపీ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. ఈనెల29న మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పార్థు పాల్గొననున్నాడు. విద్యార్థిని డీఈవో షేక్ సలీంబాషా, ఎంఈవోలు గౌరీశంకర్, ఉదయసాగర్, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఎస్సీ చైర్మన్ జైను బాబ్జి, హెచ్ఎమ్ గోవర్ధనగిరి, ఉపాధ్యాయులు అభినందించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

చెందుర్తిలో డీఎల్పీవో తనిఖీలు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తిలో కాకినాడ డీఎల్పీవో అన్నామణి గురువారం తనిఖీలు నిర్వహించారు. స్వర్ణ పంచాయతీ డిమాండ్ జనరేషన్, స్వామిత్ర గ్రౌండ్ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో విద్యాసాగర్‌కుమార్ వున్నారు.

చంద్రబాబుకు మహిళల నీరాజనం


చంద్రబాబు చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న మహిళలు

కాకినాడ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంపై నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. పెద్ద మార్కెట్ ఏరియాలోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద మహిళలు జాతీయ పతాకాలు పట్టుకుని జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినాదాలు చేశారు. టీడీపీ నేత వరు పుల రాజా జయంతి సందర్భంగా ఫౌండేషన్ ప్రత్తిపాడు శాఖ అధ్యక్షుడు అడపా జగదీష్ సమకూర్చిన రైస్ బ్యాగ్‌లు, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల సూర్యప్రసాద్, ముమ్మిడివరం శాఖ అధ్యక్షుడు అంగాని శేషగిరి వర్మ, కాకినాడ నగర శాఖ అధ్యక్షుడు కర్రి వీరబాబు, మండ పాక వీర వెంకట సత్యనారాయణ, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టుకోవాలి'

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టుకుని భూగర్భ జలాల శాతాన్ని పెంచాలని సీఎం చంద్రబాబు కోరారు. గురువారం ఆయన కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సాగునీటి సంఘాలు, ప్రాజెక్టు కమిటీలకు దిశానిర్దేశం చేశారు. జేసీ రాహుల్‌మీనా, పంపా రిజర్వాయర్ చైర్మన్ చందు, ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ వీరవెంకట నాగేశ్వరరావు, గోదావరి ఈస్ట్రన్ డెల్టా చైర్మన్ సునీల్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, డీఈ రవికుమార్, గ్రౌండ్‌వాటర్ డీడీ రాధాకృష్ణ, సాగునీటి సంఘాల అధ్యక్షులు, వైస్ చైర్మన్లు పాల్గొన్నారు.

సీఆర్‌సీఎఫ్ విలేజ్‌గా కోనపాపపేట

కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

కొత్తపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): క్లైమేట్ రీసెలెంట్ కోస్టల్ ఫిషర్‌మెన్ విలేజ్‌గా మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేట ఎంపికైందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీర ప్రాంత మత్స్యకారులకు అమలుచేసే వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఉప్పాడ-అమీనబాద్ మినీ హార్బర్లో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై)లో కోనపాప పేట గ్రామానికి మంజూరైన రూ.2కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్ అహర్నిశలూ కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయన చొరవతోనే ఉప్పాడ తీరం కోత శాశ్వత నివారణకు రూ.323కోట్లు మంజూరుకు మార్గం సుగమం అయ్యిందన్నారు. మినీ హార్బర్ నిర్మాణ ప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు తాను స్వయంగా పరిశీలించానన్నారు. మత్స్యకారులు హార్బర్లోకి వెళ్లేందుకు సొంత ఖర్చులతో నిర్మించిన మట్టి రోడ్డును గ్రావెల్ రోడ్డుగా నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్ డీఈఈ నాగేశ్వరరావును ఎంపీ ఆదేశించారు. గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం కూడా సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. ఎంపీ మాట్లాడుతున్న సమయంలో మత్స్యకారుడు పిరమళ్ళ పోలయ్య మైక్ తీసుకుని పథకాలు, బోట్లు ఎందుకని... ముందు సముద్రం కోత నుంచి శాశ్వత రక్షణ కల్పించండి మహాప్రభో అని వేడుకోవడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో తీర ప్రాంత రక్షణకు ఎంతో ప్రయత్నం చేసి విఫలమయ్యానన్నారు. పవన్‌కల్యాణ్ ఎమ్మెల్యేగా గెలిచాక తీర ప్రాంత గ్రామాలకు చేసిన మేలు ఎన్నటికీ మరువలేనివన్నారు. తొలుత ఎంపీ ఉదయ్, మాజీ ఎమ్మెల్యే దొరబాబు బోటుపై సముద్రంలోకి వెళ్లి హార్బర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఉప్పాడ, అమీనబాద్ సర్పంచ్‌లు ఉమ్మిడి మేరీ జాన్, నక్కా మణికంఠ, జనసేన నేత గంటా విజయ్‌కుమార్, జీజీహెచ్ డైరెక్టర్ రావు అక్షయ్, టెలికం ఎడ్వయిజరీ కమిటీ జిల్లా డైరెక్టర్ దొడ్డి ప్రసాద్, మాజీ సర్పంచ్ కొర్ని వెంకట రమణ, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.


మత్స్యకారులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఉదయ్‌శ్రీనివాస్


వేణుగోపాలస్వామికి త్రివర్ణ అలంకరణ

పిఠాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసియున్న రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి గురువారం త్రివర్ణ అలంకరణ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లను అర్చకుడు విజయజనార్దనాచార్యులు జాతీయ పతాకం, త్రివర్ణాలతో అలంకరించారు.


ప్రత్యేక హెల్త్ చెకప్ ప్యాకేజీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

మెడికవర్ హాస్పిటల్‌లో హెల్త్ చెకప్ ప్రత్యేక ప్యాకేజీ

సామర్లకోట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని కొప్పవరంలో గల మెడికవర్ హాస్పిటల్ అందిస్తున్న ప్రత్యేక హెల్త్ చెకప్ ప్యాకేజీ పోస్టర్లను వైద్య నిపుణులు గురువారం ఆవిష్కరించారు. రూ.1947కే అన్ని రకాల వైద్య పరీక్షలు పొందవచ్చని మెడికవర్ హెడ్ శుభాకరరావు, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 15 వరకు ఈ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందన్నారు.


కరపలో 60 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు, ఉపాధ్యాయులు


కాకినాడ రూరల్ వాకలపూడిలో జాతీయ పతాకాలతో బీజేపీ నాయకులు


కాకినాడలో భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉప్పొంగిన దేశ భక్తి

కాకినాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ కాకినాడలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం 250 మీటర్ల భారీ జాతీయ పతాకంతో టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బాలాజీచెరువు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంతోమంది నాయకుల పోరాటంతో మనకు స్వాతంత్ర్యం వచ్చిందని, వారి పోరాట స్ఫూర్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు కోరారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సీహెచ్ సాహిత్య, నాయకులు రాజేష్, కరుణ్‌కుమార్, పవన్, గమిని వేలు, 600మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేళంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు కలిసి గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాఠశాల నుంచి 60 అడుగుల జాతీయ జెండాను చేతపట్టుకుని గ్రామవీధుల్లో కలియతిరిగారు. గ్రామ పెద్దలతో కలిసి ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తి నింపారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఆర్.త్రిమూర్తులు, సీనియర్ నాయకులు మెర్ల వీరయ్యచౌదరి, చుండ్రు వెంకన్నరాయచౌదరి, డాక్టర్ బొండా వెంకన్నరావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగాలో భాగంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును జగన్నాథపురంలోని ఆయన నివాసంలో కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ దాసరి సూర్యఉమా నాగేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి త్రివర్ణ పతాకాన్ని అందజేశారు. కాకినాడ సౌత్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ మడుగు లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు భారతదేశ పటం అలంకారంలో మానవహారం నిర్మించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు, పోరాటాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకున్నారు. అనంతరం పురవీధుల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): ఆజాదీకా అమృత మహోత్సవ్‌లో భాగంగా గొల్లప్రోలులో గురువారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ పట్టణ అధ్య క్షుడు చిట్టా మధు, జిల్లా నాయకులు గండి కొండలరావు, డీవీఎస్ రాజు, రవణం సుబ్రహ్మణ్యం, మలిరెడ్డి నారాయణరావు, కర్రి సత్యనారాయణ, సైతన సత్యకుమారి, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వాకలపూడిలో సిద్ధార్థ విద్యానికేతన్ కరస్పాండెంట్ శేఖర్‌రాజు-విశాలాక్షి దంపతుల ఆధ్వర్యంలో దేశభక్తిని చాటేలా జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీని బీజేపీ నాయకులు కంచుమర్తి చినఅప్పాజీ, కాళ్ల ధనరాజు ప్రారంభించారు. జాతీయ జెండాలను ఆవిష్కరించిన అనంతరం స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులు, సమరయోధులను స్మరించుకున్నారు.


కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబుకు త్రివర్ణ పతాకం ఇస్తున్న పోస్టల్ అధికారి



గొల్లప్రోలులో తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, బీజేపీ నాయకులు


పిఠాపురంలో డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకుల తిరంగా ర్యాలీ

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికల అందజేత

కాకినాడ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి-ఇందూ జ్ఞాన వేదిక కాకినాడ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 19 వరకు జేఎన్టీయూ ఎదురుగా గల గ్రౌండ్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనాల్సిందిగా సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్‌లకు కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. అధ్యక్షుడు సలాది అనిల్‌కుమార్, ఢిల్లీ నాయుడు, కుమార్, కూరాడ సాయి, అడబాల రాంబాబు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం చరిత్రాత్మకం

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు



కాకినాడ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో మూడు దశాబ్దాల అప్రజాస్వామిక విధానాలకు అక్కడి ప్రజలు ముగింపు పలికారని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు పేర్కొన్నారు. కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ సాధించిన విజయం చరిత్రాత్మకమైనదన్నారు. పులివెందులపై ఆధిపత్యం కోసం వైఎస్ కుటుంబం 30 సంవత్సరాలుగా సాగించిన అరాచకాలకు, భయోత్పాతానికి అక్కడి ప్రజలే బుద్ధి చెప్పడం శుభపరిణామమన్నారు. విజనరీ లీడర్ చంద్రబాబునాయుడు, డైనమిక్ నేత లోకేష్ మార్గదర్శకత్వంలో టీడీపీ ముమ్ముందు ఇలాంటి మరెన్నో మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షించారు. ఈ ఫలితాలు నవ్యాంధ్ర నిర్మాణానికి శుభసంకేతాలన్నారు. జడ్పీటీసీలుగా విజయం సాధించిన లతా రెడ్డి, కృష్ణారెడ్డిలకు సతీష్‌బాబు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎంపీ క్యాంపు కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

'జగన్‌కు జైలు ఊచలు లెక్కపెట్టే సమయం వచ్చింది'


సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా లెక్కలేనన్ని తప్పులు చేసి కోట్లాది రూపాయల స్కామ్‌లకు పాల్పడ్డ జగన్‌కు జైలులో ఊచలు లెక్కలు పెట్టే సమయం ఆసన్నమైందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో జగన్ వైఖరి, చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైసీపీ అడ్రస్ గల్లంతు కావడంతో జగన్ ఏమి మాట్లాడుతున్నాడో తెలియని పరిస్థితిలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలంటూ జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఒంటినిండా కేసులు పెట్టుకుని, అక్రమాస్తుల కేసుల్లో నిలువునా కూరుకుపోయిన జగన్‌కే ఇవి చివరి ఎన్నికలన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. నరకానికి వెళ్తారని చంద్రబాబును అనడం దారుణమన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సకుమళ్ల గంగాధర్, కొరుప్రోలు శ్రీను, గుండ్ర సుబ్బారావు, అల్లవరపు నగేష్, కోళ్ల బంగారుబాబు, పిల్లి చిన్నా, మొల్లి నాగమరిడి రాజు, నల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శాంతివర్ధన పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

పెద్దాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలను పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ తీరు, విద్యార్థులకు వసతి సౌకర్యాలను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతులతో సమావేశమై వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. పాఠశాల నిర్వహణలో రాయవరపు వీరబాబు-సత్య దంపతుల సేవలపై విద్యార్థులు, సిబ్బంది సంతృప్తికర సమాధానం చెప్పడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో, ఏడీ మాట్లాడుతూ శాంతివర్ధన యాజమాన్యం అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన కంప్యూటర్ రూమ్‌ను ప్రారంభించి, విద్యార్థులకు ఉచిత బస్ పాస్, స్పీచ్‌థెరపీ కిట్, నిర్మల బీమా పథకం కార్డు, యోగాంధ్ర సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల ఏడీ కార్యాలయ పరిపాలనాధికారి రాజు, సీహెచ్, శివ రామకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్, సత్య, ఏవో వేణు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సుద్దగడ్డ వరద కారణంగా గొల్లప్రోలు పట్టణ శివారులోని కాలనీలకు వెళ్లే రహదారులపై ప్రవహిస్తున్న నీటిని, అక్కడి పరిస్థితును ట్రైనీ కలెక్టర్ మనీషా, తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ, ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం పరిశీలించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ పర్యటించారు. గొల్లప్రోలు, లక్ష్మీపురం ప్రాంతాల్లో ముంపులో ఉన్న పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.


పిఠాపురం భాష్యం స్కూలులో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు

కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు

పిఠాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాష్యం స్కూల్లో కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణల్లో చిన్నారులు, విద్యార్థులు అలరించారు. ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: పట్టణంలోని భాష్యం విద్యా సంస్థల ఆవరణలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పలువురు చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. విద్యార్థులు ఉట్టి ఉత్సవంలో పాల్గొని ఆనందపరవశులయ్యారు. తదనంతరం ఆటపాటలతో ఓలలాడించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రిన్సిపాల్ శ్రీసూర్య, శిరీష, విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్చార్జి గోవిందరాజులు విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.


సామర్లకోట భాష్యం స్కూలులో...

18, 19 తేదీల్లో జంతర్‌మంతర్ వద్ద బీసీల మహా ధర్నా

కాకినాడ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎప్పటి నుంచో అపరిష్కృతంగా ఉన్న బీసీల డిమాండ్లను పరిష్కరించాలని ఒత్తిడి తీసుకురావడం కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహా ధర్నా తలపెట్టినట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ చొల్లంగి వేణుగోపాల్ వెల్లడించారు. రామారావుపేటలోని శెట్టిబలిజ కమ్యూనిటీ హాలులో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన 'చలో ఢిల్లీ' కరపత్రాన్ని ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు వాసంశెట్టి భీమరాజు, జిల్లా కార్యదర్శి మేడిశెట్టి లక్ష్మణరావు, నాయకులు చింతపల్లి చంద్రశేఖర్, దొడ్డి వీరేంద్ర, అనసూరి రాజకుమారి, కుండల రాజ్‌కుమార్, చొల్లంగి శ్రీనివాసరావు, సుందరపల్లి గోపాలకృష్ణ, పెంకే శివ పాల్గొన్నారు.





నేడు జాతీయజెండా ఆవిష్కరణ

జగ్గంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9గంటలకు ఎంపీపీ అత్తులూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జెండా వందన కార్యక్రమం జరగనుంది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని జెండా వందనం చేయనున్నారు. ఈకార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ హాజరు కావాలని మండల అధికారులు కోరారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా : ఎమ్మెల్యే


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి

కూనవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కష్టం వచ్చిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం పార్టీ సంస్థాగత ఎన్నికల సందర్భంగా కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకి ఉన్న వారికి అండగా ఉంటానన్నారు. అనంతరం కూనవరం పార్టీ సంస్థాగత ఎన్నికను పరిశీలించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు భాస్కర్, నియోజకవర్గ పరిశీలికుడు శ్రీనివాస్ యాదవ్, సొసైటీ అధ్యక్షుడు తోటకూర వెంకటేశ్వరరావు, కూనవరం పరిశీలకుడు సుభాష్, టీడీపీ నాయకులు ఎడవల్లి భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బరపాటి ప్రకాష్, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు గడేసుల ప్రేమ్ చంద్, గడ్డిపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి సమస్యను హోం మంత్రి దృష్టికి తీసుకెళ్తా..

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీమంతుల వెంకటరమణ, అతని కుటుంబ సభ్యుల దాడిలో వెన్నుపూసకు గాయమై మంచానికే పరిమితమైన త్రివేణికి జరిగిన అన్యాయంపై హోంమంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే అన్నారు. గురువారం ఎమ్మెల్యే దంపతులు త్రివేణి ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే టీడీపీ సీనియర్ నేత షేక్ బాజీ ఆకస్మికంగా చనిపోవడంతో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'డొంకరాయిని మండల కేంద్రం చేయండి'

మోతుగూడెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలోని డొంకరాయిని మండల కేంద్రం చేయాలని ఎంపీటీసీ కరకా వెంకటరమణ మంగళగిరిలో సీఎం చంద్రబాబును గురువారం కలిశారు. గడిచిన 15 ఏళ్లుగా దీనిపై జరుగుతున్న పోరాటం గురించి వివరించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన చెప్పారు. ఈయనతోపాటు తదితరులు ఉన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ గోపాలకృష్ణ, తదితరులు

మోతుగూడెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం చదలవాడ పంచాయతీ లక్కవరం ఏకలవ్య మోడల్ పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్‌పై గురువారం అవగాహన కల్పించారు. దీనికి చింతూరు సీఐ గోపాలకృష్ణ హాజరై బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో మోతుగూడెం ఎస్ఐ సాదిక్, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు


కోటలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేత ఆదివిష్ణు, తదితరులు

వై.రామవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట, బుల్లోజిపాలెంలో గురువారం గ్రామస్థులు, విద్యార్థులతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కడబాల ఆదివిష్ణు ఆధ్వర్యంలో జాతీయ జెండాలు చేతపట్టి వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. హెచ్ఎం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలకు అంతరాయం

● ఎటపాకలో అరగంట పాటు ఇబ్బందులు పడ్డ జనం


అధ్వానంగా ఉన్న రహదారిపై అవస్థలు పడుతున్న వాహనదారులు

ఎటపాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎటపాకలో గురువారం వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా మరోమారు ప్రధాన రహదారి వర్షానికి దిగబడిపోవడంతో లారీలు, బైకులు, కార్లు స్తంభించిపోయాయి. పోలీస్‌స్టేషన్ సమీపంలో రహదారి దెబ్బతిన డంతో భద్రాచలం - చర్ల అంతరాష్ట్ర రహదారిపై అరగంటపాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రధానంగా చర్ల వైపు నుంచి భద్రాచలం వస్తున్న ఇసుక లారీల కారణంగా రహదారి దెబ్బ తింటుందని వాహనదారులు, ప్రయాణికులు ఆరోపిసున్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చాలి


పనసలపాలెం ఆశ్రమ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఏజెన్సీ డీఈవో

వై.రామవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచి 45 రోజుల పాటు వెనుకబడిన విద్యార్థులకు లెసన్ ప్లానింగ్ ఇచ్చి డీ గ్రేడులో ఉన్నవారిని ఏ గ్రేడుకు తేవాలని ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం ఆయన పనసలపాలెం ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈవో తాతబ్బాయి దొర, హెచ్ఎం అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడి ఎన్నికపై అభిప్రాయ సేకరణ


ఎన్నికకు హాజరైన టీడీపీ నేతలు

ఎటపాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండల టీడీపీ అధ్యక్షుడి ఎన్నికపై గురువారం ఎటపాకలో అభిప్రాయ సేకరణ జరిగింది. ఎంపికకు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ జరిగింది. అయితే బూత్, యూనిట్, క్లస్టర్, గ్రామకమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మొత్తం 90 మంది సభ్యుల నుంచి ప్రత్యక్షంగా అభిప్రాయాన్ని సేకరించారు. ఇందులో పురుషోత్తపట్నం నుంచి ఇద్దరు, మరో బూత్ స్థాయి నుంచి ఒకరు గైర్హాజరయ్యారు. దీంతో 87 మంది నుంచి అభిప్రాయం తీసుకోవడం జరిగింది. కాగా ఎటపాక మండలాధ్యక్షుడి పదవికి గన్నవరం గ్రామానికి చెందిన బొల్లా పుల్లయ్య, ఎటపాకకు చెందిన పాటి చలపతి పోటీలో ఉన్నారు. అయితే మొత్తం 90 సభ్యుల అభిప్రాయ సేకరణను పార్టీ అధిష్టానంకు పంపిస్తామని, త్వరలో అధిష్టానమే మండలాధ్యక్షుడ్ని ఎంపిక చేసి, ప్రకటిస్తుందని నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కాగా అంతకు ముందు ఎమ్మెల్యే శిరీషదేవి ఎటపాకలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు.

ప్రజల గుండెల్లో నిలిచిన వరుపుల రాజా

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ
● ఘనంగా వరుపుల రాజా జయంతి



ప్రత్తిపాడు: పెదశంకర్లపూడిలో వరుపుల రాజా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ
రక్తదానం చేస్తున్న రాజా కుమార్తె సత్యమాధురి, పక్కనే కూటమి నాయకులు

ప్రత్తిపాడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దివంగత టీడీపీ నేత వరుపుల రాజా ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. వరుపుల రాజా 50వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పెదశంకర్లపూడి, ప్రత్తిపాడులలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత పెదశంకర్లపూడి వ్యవసాయ క్షేత్రంలో రాజా సమాధి వద్ద ఎమ్మెల్యే కుటుంబసభ్యులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్తిపాడు హైస్కూల్ సెంటర్ వద్ద ఉన్న రాజా విగ్రహానికి ఎమ్మెల్యే, కుమార్తె సత్యమాధురి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. లయన్స్‌కమ్యూనిటీ హాల్లో మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సత్యమాధురి రక్తదానం చేశారు. లయన్స్ కమ్యూనిటీ హాల్లో జరిగిన సమావేశానికి నియోజకవర్గ కూటమి నాయకులు, అభిమానులు ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజా ఆశయాలు ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల సహకారం తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు యాళ్ల జగదీష్, మేడిశెట్టి సూర్యకిరణ్, సింగిలిదేవ్ సత్తిరాజు, వెన్నా శివ, పర్వత సురేష్,బొది రెడ్డి గోపీ, మూది నారాయణ స్వామి, జ్యోతుల పెద బాబు, బస్వా ప్రసాద్, అమరాది వెంకట్రావు, ఉల్లి వీర భద్రరావు, అలమండ చలమయ్య, మహాసేన రాజేష్, వైభోగుల సుబ్బారావు, దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, బొల్లు వెంకటేశ్వరరావు, దాసం శేషారావు, వరుపుల రామకృష్ణ, యర్రాబత్తుల గోవిందనాయుడు, అంబటి బుజ్జి, వెలుగుల నాని పెంటకోట మోహన్, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ ఎంపీపీ ఇతంశెట్టిభాస్కరరాబాబు, రాజాల చిట్టిబాబులు పాల్గొన్నారు. మెగా రక్తదాన శిబిరంలో 250మంది రక్తదానం చేయగా కాకినాడ సిద్ధార్థ బ్లడ్ బ్యాంక్, కాకినాడ ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంక్, యువసేన బ్లడ్ బ్యాంక్‌లు రక్తదాతల నుంచి రక్తం సేకరించారు. సిద్ధార్థ బ్లడ్ బ్యాంక్ అధినేతలు పుణ్యమంతుల రవి, రాజా, శ్రీను బ్లడ్ బ్యాంక్‌లో సహాయక చర్యలు చేపట్టారు.

పాఠశాలలకు 240 ఫ్యాన్లు అందజేత

వరుపుల రాజా జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ 240ఫ్యాన్లు అందజేశారు.

కత్తిపూడిలో 'ఇంటింటికీ వైద్యం'

శంఖవరం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): వరుపుల రాజా జయంతి సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కత్తిపూడిలో ఇంటింటికీ వైద్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొగలికుమారికి ఎగ్‌కార్ట్ యంత్రాన్ని అందజేశారు. కత్తిపూడి, శంఖవరం వసతి గృహాలకు, శంఖవరం కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలకు టీవీలను బహూకరించారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, వెన్నా ఈశ్వరుడు, యర్రంశెట్టి బాబ్జీ, గాబు కృష్ణ, కంచిబోయిన శ్రీను, కొయ్యా రమణ, దేశలింక వెంకటరమణ, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్ పాల్గొన్నారు.

టీవీల వితరణ

ఏలేశ్వరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరుపుల రాజా జయంతి పురస్కరించుకుని కుమార్తె వరుపుల మాధురి స్థానిక బీసీ, ఎస్సీ వసతి గృహాలకు 3 టీవీలు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు


తొండంగి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తొండంగి, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ఎస్ విద్యార్థులు గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. డిగ్రీ కళాశాల నుంచి చోడిపల్లిపేట సెంటర్ వరకూ విద్యార్థులు జాతీయ పతాకాలతో మోటార్ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. చోడిపల్లిపేట సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్, టి.రాము, మహాలక్ష్మీ నాయుడు, జగదీష్ ప్రకాష్, విజయ వర్ధన్, చంద్రకళ, దివాకర్ రావు, కిరణ్ కుమార్, వై నాగేశ్వర్రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో బీజేపీ నాయకులు గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఊటా వీర బాబు ఆధ్వర్యంలో యాత్ర సాగింది. ఈసందర్భంగా అల్లూరి విగ్రహానికి పార్టీ పూలమాలవేసి జాతీయ జెండాలతో బీజేపీ శ్రేణులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్.సత్తిరాజు. కె.వీరాసామి, ఉషా రాణి, టి.రమేష్, కె.జోగిరాజు, రామకృష్ణయాదవ్, కె.సత్తిబాబు, ఆనంద్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం పట్టణ వీధుల్లో గురువారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇంచార్జ్ ప్రగడ ప్రయాగమూర్తి నేతృత్వంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు జాతీయ జెండాలతో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు శ్రీలక్ష్మీ, వీరభద్రరావు, సతీష్, రాజేష్, పుష్ప, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో దుప్పట్ల వితరణ


ఏలేశ్వరంలో దుప్పట్లు పంపిణీ చేసున్న దృశ్యం

ఏలేశ్వరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం పట్టణంలో చైతన్యనగర్ కాలనీలో అనాథ ఆశ్రమంలో విద్యార్థులకు గురువారం వాగు సూర్యకుమారి ఆర్థిక సాయంతో 30దుప్పట్లు స్వామీ దయానంద సరస్వతీ అందజేశారు. కార్యక్రమంలో వార్డెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్ల పంపిణీ

ప్రత్తిపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రత్తిపాడులో రైతులకు సబ్సిడీపై మంజూరైన డ్రోన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జగ్గంపేట ఏడీఏ గరిమెళ్ళ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి జోకా అమృత, నాయకులు వై.జగదీష్, అంబటి బుజ్జి, వెలుగుల నాని, గోపిశెట్టిశ్రీను, సింగిలిదేవ్ సత్తిరాజు, ఇళ్ళ అప్పారావు,వంతెన శ్రీను, వై.గోవిందనాయుడు, అమరాది వెంకట్రావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



తొండంగి,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆవులమంద గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు యాదాల శ్రీను జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన శిబిరంలో 30మంది యువకులు రక్తదానం చేశారు. ఫౌండేషన్‌వ్యవస్థాపకుడు నేమాల శ్రీనువాసరావు యువకులకు మెమెంటోలు బహూకరించి సత్కరించారు. పోలవరపు రాజేష్, పిర్ల శేషగిరి, శ్రీనుబాబు పాల్గొన్నారు.

పులివెందులలో గెలిచిన ప్రజాస్వామ్యం

● జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఫలితాల్లో ఘోర ఓటమితో వైసీపీ అధినేత జగన్‌రెడ్డికి పులివెందుల ప్రజలు తగిన బుద్ధిచెప్పారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 30ఏళ్లుగా ప్రజలను భయభ్రాంతులను చేస్తూ ఎన్నికలు జరగకుండా చేసిన వారికి ప్రజలు స్వేచ్ఛ వాతావరణంలో ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించారని అన్నారు. జగన్ సొంత అడ్డాలో ఘోరంగా ఓడించారన్నారు. ఇప్పటికైనా జగన్ బుద్ధి తెచ్చుకుని తన తండ్రి రాజకీయ చతురతలను నేర్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో ఎస్వీఎస్ అప్పలరాజు, అడపా భరత్, జీను మణి బాబు, మారి శెట్టి భద్రం, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాం బాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, వేములకొండ జోగారావు, ఎర్ర బాబు, పిలా మహేష్, కర్నాకుల పెద్ద కాపు పాల్గొన్నారు.

సుపరిపాలనకు పట్టం

రౌతులపూడి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందని, రాక్షస పాలన ముగిసిందని టీడీపీ మండలా ధ్యక్షుడు తమరాల సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి సుపరిపాలనకు ప్రజలు పట్టం కట్టారన్నారు. జడ్పీటీసీ గెలుపుపై గ్రామాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు తారాజువ్వలు వేసి సంబరాలు చేసుకున్నారు. పులివెందులలో జడ్పీటీసీ ప్రజాస్వామ్య విజయమని టీడీపీనేత రెడ్డి గోవిందు అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధి చూసి ప్రజలు ఓట్లు వేశారాన్నారు.


నేతల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

ఉచిత బస్సు ప్రయాణంపై మహిళల హర్షం

జగ్గంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం యల్లమిల్లిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మహిళలకు కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని అందిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఫ్లెక్సీలకు మహిళలు పాలాభిషేకం చేశారు. టీడీపీ మండల కార్మిక శాఖ అధ్యక్షుడు చీకట్ల నాగరాజుతో పాటు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

ప్రత్తిపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దివంగత వరుపుల రాజా జయంతి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం రాత్రి కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే సత్యప్రభ కేకు కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేసి నోటు పుస్తకాలు అందజేశారు. పెద్దిపాలెంలో కె.రాంబాబు, కుండల అప్పారావుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. చిన్నశంకర్లపూడిలో టీడీపీ నేత మిర్యాల శ్రీను ఆధ్వర్యంలో, లంపకలోవలో పొంతన సురేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. గజ్జనపూడిలో టీడీపీ నాయకులు దాకారపు కృష్ణ, సింగిడి వెంకటేష్, గొప్ప గంగరాజు కేక్ కట్ చేశారు. వాకపల్లి సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.


డ్రోన్ అందజేస్తున్న దృశ్యం

వ్యవసాయ యాంత్రీకరణతో
రైతులు ముందుకు సాగాలి

కిర్లంపూడి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నూతన వ్యవసాయ యాంత్రీకరణతో రైతులు ముందుకు సాగాలని నాబార్డ్ డీడీఎం డాక్టర్ వై.సోమనాయుడు అన్నారు. మండలంలో బూరుగుపూడి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ బాల ప్రభాకర్ అధ్యక్షతన నాబార్డ్ డీడీఎం డాక్టర్ సోమనాయుడు సారథ్యంలో శ్రీసత్య ఆగ్రోసిహెచ్చి గ్రూప్ రైతులకు కిసాన్ డ్రోన్ అందజేశారు. సుమారు రూ.9.80 లక్షలు విలువ చేసే కిసాన్ డ్రోన్‌ను 80 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఇచ్చారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్ గంట శ్రీనివాస్‌రావు, బ్యాంకు రీజినల్ స్టాఫ్ ఎం.శంకర్, మాధురి దేవి, కిర్లంపూడి వ్యవసాయ అధికారిణి నాగ సుధా మాధురి, ఏఈవో సురేష్, పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం


తేటగుంటలో టీడీపీలో చేరిన వారితో యనమల రామకృష్ణుడు

తునిరూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంటలో తొండంగి మండలం హుక్కుంపేట గ్రామం నుంచి 50 కుటుంబాల వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరుగుతుండడం శుభపరిణామం అన్నారు. ఎమ్మెల్యే దివ్య సారథ్యంలో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు యువనేత యనమల రాజేష్, టీడీపీ తొండంగి మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, తుని మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, మహంకాళి కొయ్య మల్లేష్ గంట లక్ష్మణ్, గంటా దేవుడు తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీల్లో జగ్గంపేట విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల

జగ్గంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట డిఫిట్నెస్ జిమ్ అధినేత తాండ్రోతు వీర వెంకటరమణ ఆధ్వర్యంలో జగ్గంపేట నుంచి గుంటూరులో ఆగస్టు 9, 10 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో జగ్గంపేట విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించిన బి.తేజస్విని, సిల్వర్ మెడల్ సాధించిన కె.యేసురాజు, రజితం సాధించిన బి.నిఖిల్ సాత్విక్, టి.వైష్ణవి, పి.జైపాల్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు జీను మణి బాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, కోచ్ కేసాయికృష్ణ, పాల్గొన్నారు.


ఆరెంపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలి

శంఖవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విచక్షణారహితంగా పురుగుల మందులు వాడకం అనర్థమని, వాడకం తగ్గించాలని ఏవో పి.గాంధీ తెలిపారు. గురువారం ఆరెంపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో వరినారు మళ్లను పరిశీలించి సూచనలు ఇచ్చారు.

హెల్మెట్ల పంపిణీ

రౌతులపూడి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దివంగత నేత వరుపుల రాజా జయంతిని పురస్కరించుకుని ఎ.మల్లవరం గ్రామానికి చెందిన ప్రత్తిపాడు టీఎస్ఎఫ్ అధ్యక్షుడు గవిరెడ్డి గురునాథ్ వాహనదారులకు ఉచితంగా హెల్మెట్‌లు పంపిణీ చేశారు. శ్రీలక్ష్మి గణపతి ట్రాన్స్‌పోర్టు, మండల క్రషర్, క్వారీ యూనియన్ అధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

టీడీపీ నాయకులకు సత్కారం

జగ్గంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడు జీను మణిబాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడు రాయి సాయిని స్థానిక జీవీఆర్ థియేటర్ వద్ద జగ్గంపేట కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గణిత చదరంతో స్వాతంత్ర్య శుభాకాంక్షలు

గండేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ ఏఐ ఎంఎల్ చదువుతున్న పి.నిశాంత్ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎటుకూడిన 79 వచ్చేలా గణిత చదరం రూపొందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉద్యోగావకాశాలపై సదస్సు

గండేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ, సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో బీటెక్ మూడవ సంవత్సరం విద్యార్థులకు అలుమ్ని ఇంటరాక్షన్ ఈవెంట్ జరిగినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు ఆదిత్య 2014 బ్యాచ్ సివిల్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థి వి.మాతా రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సివిల్ ఇంజనీరింగ్ జాబ్స్ కోసం ఎలాంటి కోర్సులు చేయాలి, ఎలా జాబ్స్‌కి అప్లై చేయాలి, ఎలాంటి జాబ్స్ అయితే కరీర్ బాగుంటుంది లాంటి అంశాలపై చర్చించారు.


కిత్తమూరుపేటలో విద్యార్థులకు కంచాలు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు కంచాలు అందజేత

ప్రత్తిపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిత్తమూరుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెద్దిపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ జిల్లా నాయకుడు రెడ్డి అమర్‌నాథ్ గురువారం కంచాలు అందజేశారు. కిత్తమూరు పాఠశాలకు 20 కుర్చీలు బహూకరించారు. కార్యక్రమంలో రీసు సత్తిబాబు, పుట్టా వీర్రాజు చౌదరి, ఎల్.వెంకటేష్, గైహూర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.